ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 06-06- 2026 | సంపుటి: 17, సంచిక: 63, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

### నీ 10 ఏళ్ల పాలన.. నా రెండేళ్ల పాలనపై

# చర్చకు సిద్ధమా



## కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

- నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా..
- ఈ చర్చలో ఓడితే నేను దేనికైనా సిద్ధం
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి
- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వ

**జడ్చర్ల, జూన్05 (ప్రజాకలం) :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర వేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

తరువాయి 2వ పేజీలో...



### కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో

# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు


## ఆ స్థలాలల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5 (ప్రజాకలం) :** పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ, మధ్యతరగతి వర్గాలు కు లక్ష ఇండ్లు నిర్మించ బోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ు పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలములో వారి వాటాకు యజమానిని చేస్తూ పెడింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు.

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందని, దీనిని దృష్టిలోపెట్టుకొని అవసరమైన

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



### కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. తెలంగాణ జలహక్కులకు

# తీవ్రప్రమాదం

## రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకం.. సీఎంకు హరీశ్ బహిరంగ లేఖ




**హైదరాబాద్, జూన్ 5 (ప్రజాకలం) :** తెలంగాణలో జల హక్కులపై తీవ్ర రాజకీయ వివాదం రేగింది.సీఎం ఒవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాసి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర జల హక్కులకు తీవ్ర ప్రమాదం ఉందని తెలిపారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణపై హెచ్చరికలను పట్టించుకోలేదని మండిపడ్డారు. హెచ్చరికలను పట్టించుకోనందునే పంపులు దెబ్బతిన్నాయని హరీశ్ రావు ఆరోపించారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణ, రాష్ట్ర జల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కృష్ణా జలాల వినియోగంలో చారిత్రక కనిష్ఠ స్థాయికి తెలంగాణ చేరిందని తెలిపారు. ఏపీ 74 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25 శాతానికి పరిమితం అయిందని వెల్లడించారు. రైతు డిస్కం ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలన్నారు.

### ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో జాప్యంపై

# ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి

- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- స్టేషన్ ఆవరణలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామసహాయం

ఖమ్మం జూన్ 05(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల తీరుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌కు




తరువాయి 2వ పేజీలో...

### కర్ణాటక కాంగ్రెస్‌లో

# లుకలుకలు

## కర్ణాటక మంత్రి పదవికి రామలింగారెడ్డి రాజీనామా

- మంత్రిగా ప్రమాణం చేసిన 36 గంటల్లోనే రామలింగారెడ్డి రాజీనామా
- రాహుల్ గాంధీ ముందు రామలింగారెడ్డి పంచాయతీ
- బెంగళూరు అభివృద్ధి శాఖ ఇవ్వలేదని రామలింగారెడ్డి అలక



బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో లుకలుకలు బయటపడ్డాయి. శాఖల కేటాయింపు పట్ల అసంతృప్తితో ఉన్న కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. బెంగళూరు అభివృద్ధి శాఖను తనకు కేటాయిస్తామని హామీ ఇచ్చారని రామలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన 13 మంది మంత్రులకు శాఖలను కేటాయించారు. బెంగళూరు అభివృద్ధి శాఖను దక్కించుకోవడంలో రామలింగారెడ్డి పట్టుబట్టారని, అయితే ఆ శాఖ ఆయనకు దక్కలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. శాఖల కేటాయింపుపై గురువారం జరిగిన సమావేశం నుంచి మంత్రి రామలింగారెడ్డి బయటకు వచ్చారని సమాచారం. ఆ సమావేశంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగినప్పుడు తనకు 'బెంగళూరు అభివృద్ధి' శాఖను కేటాయిస్తామని 2023లో ఇచ్చిన హామీని మంత్రి ముఖ్యమంత్రికి గుర్తుచేశారు.

**రామలింగారెడ్డి అలక...**రామలింగారెడ్డి మంత్రిగా ప్రమాణం చేసిన 36 గంటల్లోనే రాజీనామా చేయడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 53 ఏళ్లుగా పార్టీలోనే కొనసాగుతున్నానని రామలింగారెడ్డి వివరణ ఇచ్చారు. వీరప్పమొయిలీ, ఎస్.ఎం కృష్ణ కేబినెట్ లో మంత్రిగా పనిచేశానని తెలిపారు. తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తితో రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరు అభివృద్ధి శాఖ ఇవ్వలేదని రామలింగారెడ్డి అలిగారని పార్టీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే శుక్రవారం బెంగళూరుకు వెళ్లనున్నారు.


## మహిళలకు ప్రభుత్వ గ్రీన్ గిఫ్ట్

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పార్కుల నిర్వహణ బాధ్యతలు
కాంట్రాక్టర్లకు బదులు మహిళలు..
పార్కుల నిర్వహణలో కొత్త అధ్యాయం

2

# చివరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తాం

## ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,జూన్ 05; (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని,కొనుగోలు కేంద్రాల నుండి వంద శాతం ధాన్యాన్ని త్వరిత గతిన గోదాములకు తరలించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రైస్ మిల్లు గోదాముల్లో నిల్వ చేసిన వరి ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి రైస్ మిల్లులు,గోదాముల నిర్వహణను

తరువాయి 2వ పేజీలో...

### తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల కొత్త దారులు చూపుతున్న

# అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి
- సంప్రదాయ ఐటీఐలను అత్యాధునిక నైపుణ్య కేంద్రాలుగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, అంతర్జాతీయ కెరీర్ అవకాశాలకు ఏటీసీలు వేదిక

**హైదరాబాద్, జూన్ 5 (ప్రజాకలం) :** ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు.

మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు




అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు.రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది.

తరువాయి 2వ పేజీలో...

## నీ 10 ఏళ్ల పాలన.. నా రెండేళ్ల పాలనపై
# చర్చకు సిద్ధమా

మొదటి పేజీ తరువాయి...

నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణే తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పిటిసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పిటిసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు.

**పాలమూరు జిల్లాకు కేసీఆర్ చేసిందేమీ లేదు: సీఎం రేవంత్ రెడ్డి**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ కోసం రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైనే రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డికి రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసి పంప్‌లు, లిఫ్ట్‌లు మాత్రమే నిర్మించారని మండిపడ్డారు. వేల కోట్ల రూపాయిల కమీషన్లు కొల్లగొట్టి.. ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎండగట్టారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల కోసం రూ. 52 వేల కోట్లకుపైగా చెల్లించామన్నారు. ప్రాజెక్టుల కోసం భూసేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణ కోసం సహకరించాలని కోరుతున్నానని ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియను అడ్డుకునేలా వ్యవహరించొద్దంటూ వారికి సూచించారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడకుండా ఉంటే అదే వాళ్లు చేసే పెద్ద సాయమని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్‌కు ఊడిగం చేయడం మాని జిల్లా కోసం పనిచేయాలంటూ బీఆర్ఎస్ నేతలతోపాటు కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ అంటే సారా.. సారా అంటే కేసీఆర్ అని సీఎం రేవంత్ అభివర్ణించారు. సోడా అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే సోడా అని ఎద్దేవా చేశారు. దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసునన్నారు. కేసీఆర్ సొంతంగా ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేవలం ప్రాజెక్టులకు పేరు మాత్రమే కేసీఆర్ మార్చారని వ్యంగ్యంగా తెలంగాణ సీఎం అన్నారు. తెలంగాణలో పండించిన ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయదా? అంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు పండించిన పంటల కొనుగోలు అంశంలో.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బాధ్యత లేదా? అంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి చురకలంటించారు. విమర్శలు చేయడం కాదు.. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పండంటూ సదరు బీజేపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

12 ఏళ్ళ అధికారంలో ఉన్న మోదీ తెలంగాణకు ఏం చేశారు? అని బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను మోదీలు అమలు చేశారా? అంటూ బీజేపీ నేతలను సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీల అమలు చేయలేని మోదీ దిగిపోతే.. రాహుల్‌ను ప్రధానిగా చేసుకుని పనులు చేయించుకుంటామని బీజేపీ ఎంపీ అర్వింద్‌కు కౌంటర్ ఇచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారని.. అందుకు మా మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

పవన్ కల్యాణ్ విషయంలో ఇంకా మాట్లాడేదేముందని ఆయన పేర్కొన్నారు. నీళ్ల విషయంలో మాకు పూర్తి స్పష్టత ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోబోమని కుండబద్దలు కొట్టారు. గోదావరిలోని 968 టీఎంసీల్లో ఒక్క చుక్కనైనా వదలమన్నారు. మిగిలినది వాళ్లు ఏం చేసుకుంటారో వారి ఇష్టమని సీఎం రేవంత్ తెలిపారు.

# మహిళలకు ప్రభుత్వ గ్రీన్ గిఫ్ట్

## ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పార్కుల నిర్వహణ బాధ్యతలు
## కాంట్రాక్టర్లకు బదులు మహిళలు..
## పార్కుల నిర్వహణలో కొత్త అధ్యాయం



హైదరాబాద్, జూన్ 5 (ప్రజాకలం) :

మహిళల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పార్కుల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలమహిళలకు అప్పగించే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంఎంసి పరిధిలోని ప్రతి జోన్‌లో కనీసం రెండు పార్కులను స్వయం సహాయక సంఘం మహిళలకు నిర్వహణ కోసం కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎల్‌బీ నగర్ జోన్ పరిధిలోని రెండు పార్కులను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు.

ఎల్ బి నగర్ జోన్ లో

సర్కిల్–12, సరూర్‌నగర్ పరిధిలోని హుడా సి–టైప్ పార్క్ నిర్వహణను జన్మభూమి ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు. అదేవిధంగా సర్కిల్–14, హయత్‌నగర్ పరిధిలోని యశోద ఎన్‌క్లేవ్ కాలనీ పార్క్ నిర్వహణను ఆదర్శ ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.

ఉప్పల్ జోన్ లో

ఉప్పల్ సర్కిల్ చిలుకనగర్ వార్డు లోని బ్యాంక్ కాలనీ పార్కు వేంకటేశ్వర స్వామి ఎస్ హెచ్ జి, జీవన జ్యోతి ఎస్ హెచ్ జి, సైలాన్ బాబా ఎస్ హెచ్ జి లకు అప్పగించారు.

నాచారం సర్కిల్ శక్తి సాయి నగర్ లోని గోకుల్ నగర్ కాలనీ పార్కు మునీర ఎస్ హెచ్ జి కు అప్పగించారు.

మల్కాజ్ గిరి జోన్ లో

కీసర సర్కిల్ లోని ప్రశాంత్ విహార్ కాలనీ పార్క్ మల్లన్న స్వయం సహాయక సంఘానికి, సాయి కృష్ణా ఎన్ క్లేవ్ పార్కు వారాహి స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.

అదే విధంగా అల్వాల్ సర్కిల్ లోని భూదేవి నగర్ పార్కు విజయ గణపతి స్వయం సహాయక సంఘానికి, బోయిన్ పల్లి సర్కిల్ లోని నెహ్రూ నగర్ పార్కు నాగ శ్రీ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.

పార్కుల నిర్వహణలో భాగంగా పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, నీటి సరఫరా, ఉద్యానవన నిర్వహణ తదితర రోజువారీ పనులను ఆయా SHG మహిళలే నిర్వహించనున్నారు. ఈ పనులు యుబీడీ సిబ్బంది సాంకేతిక మార్గదర్శకత్వంలో కొనసాగుతాయి. ఈ పైలట్ ప్రాజెక్టులో మహిళల పనితీరు సంతృప్తికరంగా ఉంటే, ప్రస్తుతం కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇతర పార్కులను కూడా దశలవారీగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ప్రాజెక్ట్ డైరెక్టర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, డీపీఓలు తరచూ పార్కులను సందర్శించి పనితీరును పర్యవేక్షించనున్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఈ పైలట్ ప్రాజెక్టులో పాల్గొనే స్వయం సహాయక సంఘాలకు ఈఎండీ, జీఎస్టీ, లేబర్ లైసెన్స్ తదితర రుసుముల నుంచి ప్రభుత్వం మినహాయింపు కల్పించింది.

99 రోజుల కార్యాచరణ – ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక

పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన అధికారులు

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 92వ రోజు సందర్భంగా తేది. 05.06.2026, శుక్రవారం రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మరియు మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టి రహదారులు, కాలనీలు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరిచారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు నగర పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని యుబిడి డైరెక్టర్ సునంద తెలిపారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో
# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

మొదటి పేజీ తరువాయి...

కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30–40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని అన్నారు.

రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదన్నారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు.

ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోన్నామని మంత్రి గారు వెల్లడించారు.

ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు.

పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు సెంటర్ నుండి ఇప్పటికే 98 శాతం ధాన్యాన్ని విజయవంతంగా తరలించామని పేర్కొన్నారు. పెద్దపల్లి,కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో లారీల జాప్యం, హమాలీల కొరత కారణంగా అక్కడక్కడ కొంతమేర ధాన్యం మిగిలి ఉందని,దానిని కూడా త్వరలోనే తరలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి పెద్దపల్లి,సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు భారీ,తిరుపతి, శ్రీనివాస్,సతీష్ లతో మాట్లాడినట్లు తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్,రంజిత్, ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది,అధికారుల సమన్వయంతో పూర్తిస్థాయిలో రవాణా ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. హమాలీల కొరత రాకుండా అదనపు సిబ్బందిని సైతం అందుబాటులోకి తెచ్చామని, పెద్దకల్వల సంతు,నరేష్‌ల సహకారంతో రాత్రి సమయంలో కూడా పనులు నిర్వహించి రెండు మూడు రోజుల్లో ధాన్యాన్ని పూర్తిగా లిఫ్ట్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేరళకు రుతుపవనాలు తాకిన నేపథ్యంలో పెద్దపల్లి,కాల్వ శ్రీరాంపూర్,ఓదెల,జూలపల్లి మండలాల్లో అక్కడక్కడ మిగిలిపోయిన ధాన్యాన్ని రాబోయే రెండు రోజుల్లో యుద్ధప్రాతిపదికన తరలిస్తామన్నారు. వరి ధాన్యంతో పాటు నియోజకవర్గంలో మక్కల కొనుగోలు ప్రక్రియను కూడా వంద శాతం పూర్తి చేసి,వాటిని నిర్దేశిత ప్రాంతాలకు చేర్చామని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక చెల్లింపుల విషయమై మాట్లాడుతూ ఇప్పటివరకు రైతుల ఖాతాలలో నాలుగు కోట్ల రూపాయలు జమ అయ్యాయని,మిగిలిన మొత్తాన్ని సైతం అత్యంత త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు. లారీ యజమాన్యాలు,అధికారులు సమన్వయంతో వ్యవహరించి ధాన్యం నిల్వ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో జాప్యంపై
# ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి

మొదటి పేజీ తరువాయి...

చేరుకున్న ఎంపీ.. సుమారు గంటన్నర పాటు స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.

క్షేత్రస్థాయిలో తనిఖీ

ఎస్కలేటర్ ను ఆన్ చేయించి రెండో ప్లాట్‌ఫామ్ కు చేరుకొని దాని పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి, నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.ఆధునికీకరణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

?ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దు.

వర్షాకాలం సమీపిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి**

ఖమ్మం నగరంలోని శుక్రవారం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ ( బిఎస్ఎన్ఎల్ ) తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

సేవల్లో నాణ్యత పెరగాలి.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.సంస్థ బలోపేతం అందరి బాధ్యత బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల కొత్త దారులు చూపుతున్న
# అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

మొదటి పేజీ తరువాయి...

ఏటీసీల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్లు కూడా అందజేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఆధునిక నైపుణ్యాల సాధనకు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు. ఏటీసీలను యువతకు లభించిన లి"సువర్ణావకాశం"లిగా అభివర్ణించిన మంత్రి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర అభ్యాసం ఎంతో అవసరమని చెప్పారు. "ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు తెలంగాణలో భవిష్యత్ ఉపాధి వ్యవస్థకు పునాదులు వేస్తున్నాయి. ఇవి మన యువతను దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతున్నాయి" అని మంత్రి పేర్కొన్నారు. ఐటీఐల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షకులు, బోధకులకు కూడా విస్తృత స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రత్యేక ఫోటో ప్రదర్శన

ఈ సందర్భంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మంత్రి, మీడియా ప్రతినిధులతో తమ అనుభవాలను పంచుకున్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా రూపాంతరం చెందడం వల్ల తమ నైపుణ్యాలు పెరిగాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని, తమ జీవితాల్లో సానుకూల మార్పులు వచ్చాయని వివరించారు. శాఖ అధికారులు, ట్రైనర్లు, సిబ్బంది కృషిని అభినందించిన మంత్రి డా. వివేక్ వెంకటస్వామి, యువతకు నాణ్యమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో వారు చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసించారు. తెలంగాణ భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు నిర్మించేందుకు ఇదే నిబద్ధతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

### - రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ



రుద్రంగి, జూన్ 05,(ప్రజాకలం ప్రతినిధి)

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ గండి నారాయణ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ ఆద్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఇట్టి సభలో పర్యవరణాన్ని కాపాడుకునేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని, గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని మానుకుని జ్యూట్, వస్త్ర సంచులను ఉపయోగించాలని సూచించారు. రుద్రంగి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఐకేపి సిఏ లు, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



రుద్రంగి, జూన్ 05, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు నిధులు మంజూరి అయినట్లు గ్రామ సర్పంచ్ గండి నారాయణ వెల్లడించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 3 లక్షల 50 వేలు, శ్రీ ముంజ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 2. లక్షల 50 వేలు, వడ్ల, కమ్మరి సంఘానికి బోరు మోటర్ కు రూ. లక్ష 80 వేల విలువ గల పోసిడింగ్ కాపీలను శుక్రవారం వారి వారి సంఘాలకు సర్పంచ్ చేతుల మీదుగా అందజేసారు. సిడిపి గ్రాంట్ కింద ఇట్టి నిధులు ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ మంజూరి చేసారని, ఇందుకు ఎంఎల్ఏ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మాజీ జడ్పీటిసి గట్ల మీనయ్య నాయకులు గడ్డం శ్రీనివాస్, తర్రె లింగం, పూదరి మహిపాల్, దయ్యాల శ్రీనివాస్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్షిప్ కు అర్హత సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు



గొల్లపల్లి జూన్ 05 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో జరిగే ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్షిప్ కు మోడల్ స్కూల్లో చదివే 8వ తరగతి విద్యార్థులు నలుగురు అర్హత సాధించారు. వారిలో సిరికొండ శశి కుమార్,మిల్కూరి శిశాంత్,సామల సిరి చందన,నాగపురి సిద్ధార్థ లు అర్హత సాధించిగా విద్యార్థులకు సంవత్సరానికి 12,000 రూపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు మెరిట్ స్కాలర్షిప్ అందుతుందనీ ఎనిమిదో తరగతిలోనే విద్యార్థులకు ఎన్ ఎం ఎం ఎస్ కోసం ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారాంతపు మాసాంతపు పరీక్ష నిర్వహిస్తూ, విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులు కూడా జాతీయస్థాయి పరీక్షలకు అర్హత సాధిస్తున్నట్లు భవిష్యత్తులో ఇదే ప్రణాళికను పాటిస్తూ ఇంకా ఎక్కువమంది జాతీయస్థాయి అర్హత సాధించే విధంగా కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ సుంకరి రవి తెలిపారు.

## రోడ్డు ప్రమాదం లో లారీ ఢీకొని మహిళ మృతి

### - చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ప్రభుత్వ హసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ల వెల్లడి

### - తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్

ఎండపల్లి, జూన్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మహిళ తేదీ 05.06.2026 శుక్రవారం రోజున 10:00 గంటలకు ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక అలియాస్ మీసా మునిలత భర్త అశోక్ వయ 34 సంవత్సరాలు కులం పెరిక అను ఆమే తన అవసరాల నిమిత్తం రాజారాంపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ గల వివేకానంద చౌరస్తా సమీపం లో రోడ్డు దాటుతుండగా అదే సమయాన జగిత్యాల నుండి బసంత్ నగర్ వైపు వెళ్తున్న లారీ నంబర్ ఏపీ-21- టీ వై-6772 లారీని నడుపుతున్న మదాను కొమురయ్య తండ్రి పోచయ్య



నివాసం పాలకుర్తి గ్రామం అను అతడు తన లారి ని అజాగ్రతగా అతి వేగంగా నడిపి మునిలత కు టక్కరివ్వగా తన తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలు కావడం తో చికిత్స నిమిత్తం అంబులెన్సు లో ప్రభుత్వ ఆసుపత్రి, జగిత్యాల కి తరలించగా అక్కడ డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువికరించినారు అని ఆమె తల్లి అయిన పత్తిపాక లక్ష్మి భర్త వెంకన్న నివాసం చర్లపల్లి అను ఆమే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనది. ఇట్టి దర్యాప్తు లో భాగంగా మృత దేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి డెడ్ బాడీని బంధువులకు ఇవ్వనైనది లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

## దోహాలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

### - తెలంగాణ వైభవాన్ని చాటిన తెలంగాణ గల్ఫ్ సమితి..

### - భారీగా తరలివచ్చిన తెలంగాణ ప్రజలు

రుద్రంగి, జూన్ 05, (ప్రజాకలం ప్రతినిధి)

ఖతర్ రాజధాని దోహాలోని భారతీయ సాంస్కృతిక కేంద్రం (ఐసీసీ) వేదికగా తెలంగాణ గల్ఫ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఖతర్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఖతర్ లో తెలుగు ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న తెలంగాణ గల్ఫ్ సమితి, ఆపదలో ఉన్న కార్మికులకు అండగా నిలుస్తూ, అత్యవసర పరిస్థితుల్లో సహాయ సహకారాలు అందిస్తూ విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది. భారత రాయబార కార్యాలయం, ఖతర్ కార్మిక మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ కార్మిక సంస్థలతో సమన్వయంగా పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయడంలో తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదా మధు, ప్రధాన కార్యదర్శి సంధ్య వినయ్ నాయకత్వం వహించగా, కార్యవర్గ సభ్యులు భవాని సాగర్, దుర్గం రాజేశ్వర్, గడ్డి రాజు, శంకర్ గౌడ్, ఎల్లయ్య తాళ్లపల్లి విశేష కృషి చేశారు. యువజన విభాగ సభ్యులు ముకుందం, రాజేష్,



ప్రవీణ్, అరుణ్, ప్రసాద్, సుధాకర్, బొల్లె రాజ, గంగారం, దీపక్, మధు తదితరులు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమానికి దాతలుగా సహకరించిన హరి రెడ్డి, సాగర్, రాథోడ్‌లకు తెలంగాణ గల్ఫ్ సమితి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళాకారులు, స్వచ్ఛంద సేవకులు, ప్రేక్షకులు, దాతలు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ సంస్థ ధన్యవాదాలు తెలియజేసింది. తెలంగాణ గౌరవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటుతూ, ప్రవాస తెలుగు ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిన ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భవిష్యత్తులో మరిన్ని సేవా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ గల్ఫ్ సమితి ప్రతినిధులు తెలిపారు.

## నేరాల నివారణతో పాటు నేరాలను త్వరితగతిన ఛేదించాలి

### "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయాలి : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### బక్రీద్, హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరగడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయం





జగిత్యాల్ ప్రతినిధి జూన్ 5 (ప్రజాకలం)

సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో ఆయన పోలీస్ అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. గత నెలలో నమోదైన నేరాలపై సమగ్రంగా చర్చించిన ఎస్పీ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి వాటి సంఖ్యను తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారికి నాణ్యమైన, సత్వర సేవలు అందించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందని పేర్కొన్నారు. అలాగే జిల్లాల మరియు రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి సరఫరా మార్గాలను గుర్తించి కీలక వ్యక్తులపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలను ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు**

సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ప్రతి పట్టణం, కాలనీ, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను ప్రజలకు, వ్యాపారులకు వివరించాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూవివాదాలు, పాత కక్షలతో నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై అవసరమైతే కొత్తగా రౌడీషీట్లు ఓపెన్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బక్రీద్, హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరగడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, ఎస్‌బీ డీఎస్పీ వెంకటరమణ, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్స్పెక్టర్ లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల్ ప్రతినిధి జూన్ 5 (ప్రజాకలం)

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత అని, ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలకు చెట్ల పెంపకం ఒక ప్రధాన పరిష్కార మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా అంతే ముఖ్యమని ఎస్పీ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు సమాజంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీసు శాఖ కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ సందర్భాల్లో మొక్కల నాటే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పచ్చని పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.ఐలు సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.







## ఉరివేసుకుని వృద్ధుడు ఆత్మహత్య



గొల్లపల్లి జూన్ 05 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం వేణుగు మట్ల గ్రామానికి చెందిన ఐతేనేని పోచయ్య 70 అనే వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత నాలుగు సంవత్సరాలుగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున

తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతుని భార్య ఐతేనేని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు

## శ్రీకాళహస్తిలో ఘనంగా 'ఉత్తమ పాత్రికేయ పురస్కార ప్రధానం

### - పాత్రికేయుడు బాశెట్టి హరీష్‌కు ఉత్తమ పాత్రికేయ పురస్కారం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 5 (ప్రజాకలం) ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య బలమైన వారధిగా నిలుస్తోందని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ అన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో వార్షిక 'ఉత్తమ పాత్రికేయ పురస్కార' ప్రదానోత్సవం శుక్రవారం శ్రీకాళహస్తిలోని గంగా సదన్‌లో అత్యంత వైభవంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ వెన్నం, ప్రముఖ బాశెట్టి హరీష్ కు 'ఉత్తమ పాత్రికేయ పురస్కారాన్ని' అందజేసి ఘనంగా సత్కరించారు.

**సత్యనిష్ఠతో కూడిన జర్నలిజం అభినందనీయం**

ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని అన్యాయాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం కలం యోధులుగా పోరాడే పాత్రికేయుల సేవలు అమూల్యమైనవన్నారు. సత్యనిష్ఠ, ధైర్యం, నిబద్ధతలతో విధి నిర్వహణ చేస్తూ, సమాజ చైతన్యానికి తోడ్పడుతున్న జర్నలిస్టులను గౌరవించుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.

**పురస్కార గ్రహీతలకు అభినందనలు**

దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే పాత్రికేయుల బాధ్యత ఎంతో కీలకమైందని అన్నారు. అవార్డు అందుకున్న బాశెట్టి హరీష్‌తో పాటు, ప్రతి ఏటా ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి దినపత్రిక సంపాదకులు నాంపల్లి శ్రీనివాస్, పలువురు ప్రముఖులు, భాషాభిమానులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితునికి డాక్టర్ రఘు పరామర్శ



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 5 (ప్రజాకలం) మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన అవుట్ల శంకర్ కుమారుడు అనారోగ్యంతో మెట్ పల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పలు వైద్య సలహాలు, సూచనలు అందించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

### - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 5( ప్రజాకలం) ప్రతి ఒక్కరు మొక్కలు నాటే సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని మెట్ పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెవిన్యూ డివిజనల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి వనమహోత్సవ



కార్యక్రమంను నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, చెట్లు మానవ జీవితానికి ఎంతో అవసరమని, చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడతాయని, ఉష్ణోగ్రతలను నియంత్రించి పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని పేర్కొన్నారు. వర్షపాతం పెరగడానికి, జీవ వైవిధ్య పరిరక్షణకు చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, గౌరవ వార్డ్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డి.ఈ నాగేశ్వరరావు, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ సి. హెచ్ రాజ్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ విష్ణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్, ఇంచార్జ్ శానిటేషన్ జువాన్ ముజీబ్,మెప్మా ఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా కలం

శనివారం, జూన్ 6, 2026

# నై.. నై.. రుతుపవనాలు

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. నైరుతి రుతుపవన కాలం.జూన్ 1వ తేదీ వచ్చింది అంటే చాలు, కేరళ తీరాన్ని వర్షాలు పలకరిస్తాయి. తద్వారా దేశవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని అందరూ ఆశిస్తారు. అయితే 2026 సీజన్‌లో నైరుతి రుతుపవనాల రాక కోసం కొంత జాప్యం చోటు చేసుకుంది. ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 1న ఇవి కేరళను తాకలేకపోయాయి. వాతావరణ పరిస్థితుల అనుకూలించకపోవడంతో ఇవి ప్రస్తుతం ఉన్నచోటే స్తబ్ధుగా నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకాల్సిన రుతుపవనాలు, ఈ సారి ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇవి మార్గమధ్యలో నిలిచిపోయాయని భారత్ వాతావరణ శాఖ, ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ధ్రువీకరించాయి. రుతుపవనాల ద్రోణి కదలికలు మందగించడమే దీనికి ప్రధాన కారణం. పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది: సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్థిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది. భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టూ చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు. ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. ఈ జాప్యాన్ని ప్రధాన కారణం ఏంటంటే... అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే. ఈ రెండు కూడా రుతుపవనాల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయి. పశ్చిమ దిశ నుంచి వీచే గాలులు రుతుపవనాలను కేరళ తీరం వైపు నెట్టడంలో సహాయపడాలి కానీ ప్రస్తుతం గాలి దిశ, వేగం ఇందుకు అనుకూలంగా లేవు. అయితే ఈ ఆలస్యానికి రాబోయే ఎల్‌నినో ప్రభావానికి ఎలాంటి సంబంధం లేదని స్కైమెట్ వాతావరణ, వాతావరణ మార్పుల విభాగంలో వైఎస్ ప్రెసిడెంట్ మహేష్ స్పష్టం చేశారు. రుతుపవనాలు కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయని ఆయన వివరించారు. కేరళలోని రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అవి పూర్తి అయితేనే అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటిస్తారు. కేరళ, కర్ణాటక, లక్ష్యద్వీప్‌లోని సుమారు 60 శాతం వాతావరణ కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు కనీసం 2.5 మి.మి. వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పరిమితి ఇంకా నెరవేరలేదు. అందుకే అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికి రుతుపవనాలు ఆగిపోయినప్పటికీ , ఆశాజనకమైన వార్త కూడా ఉంది. స్కైమెట్ అంచనాల ప్రకారం రాబోయే గురువారం లేదా శుక్రవారం నాటికి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉంది. వచ్చే 3-4 రోజుల్లో అరేబియా సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, బంగళాఖాతంలోని మెజారిటీ ప్రాంతాలు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు ఇవి విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న ఐఎండీ త్వరలోనే రుతుపవనాల రాకపై సవరించిన తేదీని ప్రకటించే అవకాశం ఉంది. భారత్‌లో రుతుపవనాలకు కేరళ ప్రవేశ ద్వార లాంటిది. ఇక్కడికి రుతుపవనాలు చేరిన తర్వాతే దేశవ్యాప్తంగా వర్షాలు విస్తరిస్తాయి. వర్షాలపైనే దేశంలోని సుమారు 70 శాతం సాగు భూమి ఆధారపడి ఉంది. రుతుపవనాలు ఆలస్యమైతే విత్తనాలు వేయడం ఆలస్యమవుతుంది. అది ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. అయితే కొన్ని రోజుల జాప్యం సర్వసాధారణమేనని, రుతుపవనాలు పుంజుకుంటే ఆ తర్వాత వర్షపాతం సాధారణంగానే ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం

## - కీర్తిశేషులు గౌరవెల్లి లక్ష్మణరావు జ్ఞాపకార్థం

### - బహుమతులు ప్రధానం చేసిన సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, ఎమ్మార్వో ఎడ్ల అనిల్ కుమార్



ఎండపల్లి, జూన్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం లో కీర్తిశేషులు గౌరెల్లి లక్ష్మణరావు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ గ్రామ సర్పంచ్ శ్రీ రెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యం లో క్రికెట్ టోర్న మెంట్ లో భాగంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో 10 జట్లు పాల్గొనడం జరిగింది. శుక్రవారం రోజున ఫైనల్ మ్యాచ్ రమేష్-11, ప్రదీప్-11 జట్ల మధ్య హోరా హోరీగా సాగింది. రమేష్-11 టీమ్ అద్భుతమైన విజయం తో విన్నర్స్ గా గెలుపొందారు విజేతలకు గ్రామ సర్పంచి జి రెడ్డి మహేందర్ రెడ్డి, తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు మొదటి బహుమతిని 5000 రూపాయలు అందుకున్నారు ప్రదీప్ -11 రెండవ బహుమతి 3000 రూపాయలు అందు కున్నారు ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథులుగా ఎండపల్లి మండల ఎమ్మార్వో ఎడ్ల అనిల్ కుమార్, ఆర్ ఐ అన్వేష్, హాజరై క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఎమ్మార్వో మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి క్రీడల లో రాణిస్తూ మండల,జిల్లా, రాష్ట్రస్థాయి అలాగే దేశ స్థాయికి ఆడాలని చెప్పడం జరిగింది. గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి గురించి మాట్లాడుతూ మీ గ్రామాన్ని అభివృద్ధి పతం లో నడిపిస్తూ యువతకు మంచి ఆదర్శంగా నిలుస్తూ మిమ్మల్ని క్రీడల లో ప్రోత్సహిస్తూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకపోతున్నందుకు చాలా సంతోషం గా ఉందని వ్యక్తం చేశారు. అలాగే గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత చదువు తో పాటు క్రీడల లో రాణించి మన గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ క్రాంతి కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మాసిపెద్ది గోపాల్ రావు, కొక్కిరాల గోపాల్ రావు, కార్తీక్ రావు, ప్రశాంత్ రావు అలాగే గ్రామ ప్రజలు, క్రీడా భిమానులు, సినియర్ క్రీడాకారులు, పాల్గొన్నారు.

# రేపటితో ధాన్యం కొనుగోలు పూర్తి...

## - రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

## - రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు...




ఇబ్రహీంపట్నం జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గం లోని అన్ని ధాన్యం సేకరణ కేంద్రాల్లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని రేపటితో ధాన్యం కొనుగోలు పూర్తి అవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు వర్షకొండ వేముల కుర్తి గ్రామాలలో ఈరోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అనంతరం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలంలో ఈరోజు వరకు 60 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేశామని ధాన్యం కొనుగోలు చేశామని రేపటితో మిగతా ధాన్యం కొనుగోలు కూడా పూర్తి అవుతుందని అన్నారు అదేవిధంగా మల్లాపూర్ మండలంలో 45 వేల క్వింటాల్ లు కొనుగోలు చేశామని మిగతాది రేపటితో పూర్తవుతుందని పేర్కొన్నారు దీంతోపాటు మెట్టుపల్లిలో 60000క్వింటాల్ లు కొనుగోలు చేశామని కోరుట్లలో 36900క్వింటాల్ లు ఇప్పటికే కో నుగోలు చేశామని అన్నారు ఇది ఒక రికార్డు అని ఇప్పటివరకు ఎప్పుడు కూడా ఈ స్థాయిలో కొనుగోలు చేయలేదని గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతులను నానా ఇబ్బందులకు గురి చేశారని టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతులను నిలువు దోపిడీ చేశారని కానీ నేడు అలాంటి దోపిడీకి అడ్డుకట్ట వేశామని కృష్ణ రావు అన్నారు కానీ నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి దాన్యం గింజ వరకు చివరి మొక్కజొన్న గింజ వరకుతడిసిన ధాన్యంకూడ ప్రభుత్వం కొనుగోలు చేసిందని అన్నారు కోరుట్ల నియోజకవర్గ రైతుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని జువ్వాడి కృష్ణారావు అన్నారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్ సర్పంచ్ వెంకటి రామరాజువార్డు సభ్యులురాకేష్ చంద్రయ్య గూడ బుమన్న దూదిగాం గంగాధర్ లింబాద్రి రాజు శ్రీనివాస్ నరసయ్య రాజేందర్ శివకుమార్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు

# వైద్యుల బదిలీల్లో జీవో 38 అమలు చేయాలి

## ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి

జగిత్యాల ప్రతినిధి జూన్ 5 (ప్రజాకలం)

వైద్యుల బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38లో పేర్కొన్న నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీజీజీడీఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రోజు నిరసన తెలుపుతూ వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 38లో పొందుపరిచిన అన్ని ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ వైద్యులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో లేదా సమీప ప్రాంతాల్లో విధులు నిర్వహించేలా కల్పించే స్పౌస్ ప్రాధాన్యతతో పాటు ఇతర ప్రత్యేక ప్రాధాన్యతా ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. వైద్యులు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే బదిలీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం గుర్తింపు పొందిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి




చేశారు. జీవో 38 నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు రాష్ట్ర సంఘం పదాధికారులు ఎవరూ బదిలీలకు సం బం ధించిన ఆప్షన్ ఫారాలను సమర్పించవద్దని సమావేశంలో తీర్మానించినట్లు వెల్లడించారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే వైద్యసేవలను నిలిపివేసేందుకు కూడా వెనుకాడబోమని డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో టీజీజీడీఏ జిల్లా కోశాధికారి డాక్టర్ జి.నవీన్‌తో పాటు టీవీవీపీ,మెడికల్ కాలేజీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని వైద్యులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకం..

## - చిన్నారుల పోషకాహారానికి తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహార స్థాయిని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తొలి దశలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజూ ఉప్మా లేదా కిచిడీతో పాటు పాలు అందించనున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్న నేపథ్యంలో ఉదయం అల్పాహారం కూడా అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు, ఎదుగుదల లోపం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉదయం పూట ఖాళీ కడుపుతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం అందించడంద్వారా వారి ఆరోగ్యం,ఏకాగ్రత,శారీరక ఎదు గుదల మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రకటించిన వేసవి సెలవులను జూన్ 10 లేదా 12 వరకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# స్వీయ ధ్రువీకరణ అందచేయాలి

## - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్



మెట్ పల్లి(కోరుట్ల) ప్రతినిధి జూన్ 5 (ప్రజా కలం) పట్టణ పరిధిలో చేయూత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకు ద్వారా చేయూత పెన్షన్లు పొందుతున్న ప్రతి లబ్దిదారు తప్పనిసరిగా స్వీయ ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఇంకా పూర్తి చేసుకోని వారు 15 లోపు సంబంధిత వార్డు అధికారులను లేదా మున్సిపల్ కార్యాలయం లో సంప్రదించి పూర్తి చేసుకోగలరు.

# చిన్నాపూర్ వెల్గొండ గ్రామాల లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బుగ్గారం, జూన్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం మండలం చిన్నాపూర్, వెల్దొండ గ్రామాల లో ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వారి సహకారం తో వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆ గ్రామాల సర్పంచ్ లు గట్టు శారద-గంగారాం, నీలం నందిని-సంతోష్ లతో జిల్లా కాంగ్రెస్ నాయకులు, వేముల సుభాష్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో వెల్గొండ మాజీ సర్పంచ్ కొండపల్లి సంతోష్ రావు, గ్రామ శాఖ అధ్యక్షులు కస్తూరి మల్లేష్, వెల్గొండ ఉప సర్పంచ్ బండ్ర అంజి, గడ్డం నారాయణ, రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సంకెనపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## - మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్



వెల్గటూర్, జూన్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ వెల్గటూర్ మండలం సంకెనపల్లి గ్రామం లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురష్కరించుకొని గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్ ముఖ్య అథిదిగా హాజరై స్వయంగా ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంర క్షించడం ద్వారా పర్యావరణ పరి రక్షణకు తమ వంతు బాద్యతను నిర్వర్తించాలని సర్పంచ్ పూజ పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడబడటమే కాకుండా గ్రామాలు మరింత పచ్చ దనంతో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామపంచాయతీ కార్యదర్శి గోపు భీమయ్య, అంగన్ వాడీ టీచర్ ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, గ్రామ పంచాయతి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్ తెలిపారు.

# ఈ నెల 7న పెద్దపల్లికి మాజీ మంత్రి హరీష్ రావు

## - బీఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

## - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పెద్దపల్లి,జూన్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా,భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యలపై పోరాట వ్యూహాలను ఖరారు చేసేందుకు ఈ నెల 7న నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మెయిన్ రోడ్డులో గల తిరుమల గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్,మాజీ శాసన సభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు హాజరై,పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి,ప్రజా పక్షాన నిలబడి పోరాడటానికి ఈ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,నియోజకవర్గంలోని ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు,అన్ని మండలాల మరియు పట్టణాల కార్యవర్గ సభ్యులు,ముఖ్య నాయకులు,క్రియాశీలక కార్యకర్తలు,పార్టీ అభిమానులు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి, భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మల్దకల్‌లో ప్రీ-ప్రైమరీ పాఠశాలల టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**- దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి ఎంఈఓ**

**- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు**



గద్వాల ప్రతినిధి జూన్ 5 (ప్రజా కలం న్యూస్) మండల కేంద్రంలోని మల్దకల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రారంభం కానున్న ప్రీ-ప్రైమరీ తరగతుల్లో బోధన కొరకు అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాధికారి (వీఆర్) ఎంఈఓ జి.సురేష్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన మహిళా అభ్యర్థులు, ఉపాధ్యాయ పోస్టుల కొరకు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో వచ్చిన దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు నాణ్యమైన పునాది విద్యను అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన దరఖాస్తులను మెరిట్ మరియు నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా పరిశీలించి తగిన అభ్యర్థులను ఎంపిక చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, సిఆర్పీలు పాల్గొన్నారు.

## పచ్చని ప్రకృతి పల్లె ప్రజల ప్రాణాలకు ఊపిరి

**-సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి**

గద్వాల ప్రతినిధి జూన్ 5 (ప్రజా కలం న్యూస్) ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ ఒక్క చెట్టు నాటితే వందల ప్రాణాలకు ఊపిరి పోసినట్లే అంటూ నినాదం చేస్తూ గ్రామస్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. పచ్చని తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్,సెక్రటరీ శేఖర్,వార్డ్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## నేడు సాకారమవుతున్న పేదల ఇంటి కల

**- పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత**

**- టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము**

**- గౌరిదేవిపేటలో హౌసింగ్ గ్రామసభ ఏర్పాటు**




ప్రజాకలం ప్రతినిధి ఎటపాక , జూన్ 05:

పేదల ఇంటి కల నేడు కూటమి ప్రభుత్వంలో సాకారమవుతుందని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గౌరిదేవిపేట గ్రామపంచాయతీలో శుక్రవారం నాడు సచివాలయం కార్యదర్శి శ్రీలక్ష్మి అధ్యక్షతన హౌసింగ్ లబ్ధిదారులతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కూటమి ప్రభుత్వం గౌరిదేవిపేట పంచాయతీ పరిధిలో ఇల్లు లేని నిరుపేద , మధ్యతరగతి కుటుంబాలకు చెంది , అర్హులైన 40 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముక్కెర భద్రరావు , మల్లెల లక్ష్మణరావు , బొమ్మగాని శ్రీనివాసరావు , అంగన్వాడీ కార్యకర్తలు , గ్రామస్తులు , డ్వాక్రా మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

## తానూర్ లో మోస్తరు వర్షం

తానూర్, జున్ 05(ప్రజా కలం): తానూర్ తోపాటు మండలంలోని కోలూర్,మొగిలి,జౌలా(కె),హిప్నెల్లి తదితర గ్రామాలలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది, గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అవస్థలు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది, వాతావరణం ఒక్కసారిగా చల్లబడి, కమ్మేసిన నల్లటి మేఘాలతో ఆకస్మికంగా వర్షం కురవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు, ఎండ వేడి నుంచి ఉపశమనం లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# పట్టణ పరిశుభ్రతలో ప్రజలదే బాధ్యత

**- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్**

పెద్దపల్లి,జూన్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పట్టణ మున్సిపల్ పరిధిలో గురువారం కురిసిన అకాల వర్షం,ఈదురుగాలుల బీభత్సానికి పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలమట్టమవడంతో స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను సందర్శించిన ఆయన,వర్షపు నీరు నిలిచిన ప్రదేశాలను, డ్రైనేజీ సమస్యలను స్వయంగా పరిశీలించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని అప్రమత్తం చేసి,డ్రైన్ బ్లాకేజీలను తక్షణమే తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,రోడ్లపై,డ్రైన్లలో ఇష్టానుసారంగా చెత్త వేయడం వల్లే పూడిక పేరుకుపోయి వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే వర్షాకాలంలో ఇటువంటి సమస్యల వల్ల



ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,కాబట్టి ఎవరూ డ్రైన్లలో చెత్త వేయకూడదని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా,చిరు వ్యాపారులు రహదారులను ఆక్రమించరాదని స్పష్టం చేస్తూ..నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ పర్యటనలో స్థానిక కౌన్సిలర్లు కొమ్ము సుధాకర్,పాగాల శ్రీకాంత్,మున్సిపల్ అధికారులు,శానిటేషన్ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

**అదనపు జిల్లా న్యాయమూర్తి కే.స్వప్న రాణి - పర్యావరణ దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ**



పెద్దపల్లి,జూన్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు జిల్లా న్యాయమూర్తి కే.స్వప్న రాణి న్యాయస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.ప్రకృతి సమతుల్యతను కాపాడటానికి చెట్ల పెంపకం,ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ,నీటి సంరక్షణ మరియు పర్యావరణహిత జీవన విధానాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు,అటవీ నిర్మూలన వంటి గంభీర సమస్యలను ఎదుర్కోవడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.మొక్కలను కేవలం నాటడమే కాకుండా,వాటిని బాధ్యతాయుతంగా సంరక్షించడం ముఖ్యం అని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతంలో కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ఆక్సిజన్ దొరకక ప్రజలందరూ పడిన ఇబ్బందులను ఈ సందర్భంగా గుర్తుచేస్తూ,భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి ఉపద్రవాలు వచ్చినా ఎదుర్కొనేలా మనం సిద్ధంగా ఉండాలని,అందుకు ప్రకృతిని కాపాడుకోవడమే ఏకైక మార్గమని తెలిపారు.అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్రత్యేక గోడ పత్రికను అధికారులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎన్.మంజుల,పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్,ప్రభుత్వ న్యాయవాది మార కిషోర్,పెద్దపల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి రాచూరి శ్రీకాంత్,జిల్లా అటవీశాఖ అధికారులు,న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పోలీస్ సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది

**- రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

నిర్మల్ జూన్ 05 ప్రజాకలం జిల్లా ప్రతినిధి

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ, దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. దివ్యాంగుల కొరకు రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతుందన్నారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ విషయంలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకొని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో



ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కొరకు స్కూటీలు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అర్హులైన పలువురు దివ్యాంగులకు కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ లు ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్ లు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు అందించారు.

అనంతరం కలెక్టర్ ప్రాంగణంలో కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు.

ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి మాట నిలబెట్టుకోవాలి

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి : బండి రమేష్ డిమాండ్**



పాలేరు జూన్ 05( ప్రజా కలం న్యూస్)

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర రెవెన్యూ ,గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మాట నిలుపుకోవాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా పాలేరు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇండ్లు కేటాయిస్తూ. అర్హులను పక్కన పెడుతున్నారని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మొత్తం అవినీతిమయం, డబ్బులు ఇచ్చిన వారికి, లేదా కాంగ్రెస్ పార్టీ వారికి అర్హత లేకున్నా ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చారని ఆరోపించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మాత్రం అలా జరగకుండా నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. పాలేరు నియోజకవర్గంలో రెండో విడత ఇందిరమ్మండ్ల ఎంపికలో అనర్హులు, అర్హత లేకున్నా కాంగ్రెస్ పార్టీ అయ్యుంటే వారికే ఇల్లు కేటాయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఈ రెండో విడతలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇల్లును కేటాయించి, అర్హులను పక్కన పెడితే మాత్రం పాలేరు డివిజన్ వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, సిపిఎం మండల కార్యదర్శి తోటకూర రాజశేఖర్, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్, మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ,చిట్టూరి వెంకన్న, పందిరి వీరారెడ్డి, ఎర్రబోయిన సురేష్, కర్ణబాబు, జవ్వాజి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జూన్ 05 ప్రజాకలం జిల్లా ప్రతినిధి

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు.

అనంతరం 2026 - 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చలో జడ్చర్ల రేవంతన్న సభకు కొత్తూరు నుండి కదిలిన జనసంద్రం

**- కొత్తూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు**

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపుతో జడ్చర్ల విజయగర్జనకు ఉత్సాహంగా బయలుదేరిన జనవాహిని**



కొత్తూరు జూన్ 05 ( ప్రజా కలం ):ప్రతినిధి జడ్చర్ల వేదికగా తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్వహించబోయే చారిత్రాత్మక భారీ బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గంలో చలో జడ్చర్ల సెగ తాకింది. నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపును అందుకుని కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షులు జండగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున జడ్చర్లకు తరలివెళ్లారు.సభను అద్భుత విజయవంతం చేసేందుకు మహిళలు అత్యంత ఉత్సాహంగా, భారీ కాన్వాయ్‌లతో సభ ప్రాంగణానికి బయలుదేరారు.ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమ్మరి జనార్దన్ చారి,చిలకమర్రి నరసింహ,పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,గోవిందు నాయక్,పెంటయ్య యాదవ్, రాజు,పాశం కృష్ణ,శివ కుమార్ గౌడ్,తీగాపూర్ ఆంజనేయులు,బబ్లు,నరసింహ గౌడ్,కొండారెడ్డి సుమన్,తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శి ఎ.వి. రాజు

**- సర్పంచ్ కొమ్ము కృష్ణ ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్ సన్మానం**



నందిగామ జూన్ 05 ( ప్రజా కలం ):ప్రతినిధి నందిగామ గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎవి. రాజుకు శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ నూతన కార్యదర్శికి శాలువా పూలమాల వేసి సాదరంగా స్వాగతం పలికారు నూతన కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో నందిగామ గ్రామ పరిపాలన మరింత పారదర్శకంగా వేగంగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను విజయవంతం చేయడానికి గ్రామ సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చింతెటి లతాశివకుమార్ గౌడ్, అగ్గి సురేష్ గౌడ్, అగ్గి ప్రసాద్ గౌడ్, పిట్టెల రాములు,చింతెట్టి క్రిష్ణ గౌడ్,బంట్రపు జంగయ్య గౌడ్,నరేందర్ రెడ్డి (సీఎం), చిన్నగాళ్ల అశోక్,ఎర్రగారి రమేష్,తడుకల జంగయ్య, మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొని నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రీడలను ప్రోత్సహిద్దాం.. మంచి విద్యార్థులను తయారు చేద్దాం : ఎంపి ఈటల రాజేందర్

రంగారెడ్డి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ -2026 ముగింపు ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గోన్నారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో చేసిన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకాలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా చదువు తప్ప ఇంకోటి లేదు. అదొక్కటే సరిపోదు, సంపూర్ణత్వం ఇవ్వదు.విద్యార్థికి తనకాళ్ళ మీద తను నిలబడేలా విద్య ఉండాలి తప్ప.. మార్కులే పరమావధి కాకూడదు.అన్నిటినీ తట్టుకొని నిలబడే మానసిక స్థైర్యం అందించేవి క్రీడలు.ప్రభుత్వంతో పాటు అనేక మంది క్రీడాభిమానులు కలిసి ఈ క్యాంప్ నిర్వహించారు. కోచింగ్ ఇచ్చిన టీచర్లకు, ఓపికగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, నిర్వాహకులకు, అధికారులకు నా హృదయపూర్వక అభినం దనలు. మనం కనకూడని వినకూడని అనేక రుగ్మతలు వెంటాడుతున్నాయి.. వాటి నుంచి దూరం చేయగలిగిన సత్తా క్రీడలకు ఉంది. క్రీడలను ప్రోత్సహిద్దాం మంచి విద్యార్థులను తయారు చేద్దామని అన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటిన బిజెపి గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు జూన్ 05(ప్రజా కలం న్యూస్ )

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పిలుపు మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి, వైద్యురాలు డాక్టర్ లోహితతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన జీవనాన్ని అందించగలమని పేర్కొన్నారు. పర్యావరణాన్ని రక్షించడం భావితరాలకు అందించే గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక 5వ వార్డు సభ్యురాలు శ్రీమతి మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, ఆసుపత్రి సిబ్బంది దామళ్ళ అనిల్, కోటి, మంద చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

జూన్ 5 మెదక్ జిల్లా. పెద్ద శంకరంపేట్ : పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని పెద్ద శంకరంపేట తాసిల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఎస్సై ప్రవీణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై పోలీస్ సిబ్బంది . తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో తాసిల్దార్ ఎంపీడీవో. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి షర్ఫుద్దీన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ సామాజిక బాధ్యత అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని. మొక్కలను నాటాలని. ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు.. పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సైతం ఆయా ప్రదేశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీవో జాకీర్ హుస్సేన్. ఈజీఎస్ ఏపీవో సంతోష్ కుమార్ ఈసీ నవాజుద్దీన్ . పెద్ద శంకరంపేట పర్యావరణ గతి విధి బాధ్యులు శైలేష్ . పడాల యశోద ర్.పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### - జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి




నిర్మల్ జూన్05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల అందరం పర్యావరణ పరిరక్షణలో కృషి చేసినవారమౌతామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుభకరన్, అధికారులు చంద్రమోహన్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నిర్మాణంలో అడ్డంకులు తొలగించాలి

### - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నిర్మల్, జున్ 5(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): అభివృద్ధి పనుల నిర్మాణంలో అడ్డంకులను తొలగించేందుకు అధికారులు చొరవ చూపాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి, కడెం మండలం అల్లంపల్లి, భావా నాయక్ తండా, దొందారి, తదితర గ్రామాల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అటవీ శాఖ అనుమతుల కారణంగా పలు గ్రామాలలో అభివృద్ధి పనులు జరుగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మురుగు కాల్వల నిర్మాణం, అంగన్వాడి భవనాల నిర్మాణం, రోడ్లు, వంతెనలు, తదితర నిర్మాణాల విషయంలో అనుమతులు లభించక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయా ప్రాంతాలు అభివృద్ధికి దూరం అవుతున్నాయని, అధికారులు అన్ని సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని అన్నారు. విద్యుత్ సౌకర్యం, మెరుగైన టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైనచోట అటవీ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి పనులకు సంబంధించి అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఆయా గ్రామస్తుల సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని అన్నారు. తమ పరిధిలో ఏదైనా సహకారం అవసరముంటే సహకారం అందిస్తామని చెప్పారు. కొన్ని పనులకు సంబంధించి అవసరమైన కార్యాచరణ చేపడతామన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలు ఎవరికైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఎస్ డిఎల్ఎ నాయక్వాడి జల కుమారి, విద్యుత్ శాఖ ఈఈ సుభాష్, పంచాయితీరాజ్ ఎస్ఈ శంకర్, ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమన్న, ఇతర అధికారులు, పలు గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎట్టపాక వైకాపా నాయకులు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జూన్ 05:

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనంత దగా మరియు మోసపూరితమని ఎటుపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పాలనకు మారుపేరైన వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి కంటే మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసి అధికార పీఠాన్ని దక్కించుకున్న కూటమి ఈరోజు ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా, సూపర్సిక్స్ హామీలను కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు ఆడబిడ్డ నిధి అందిస్తామని చెప్పి ఇప్పటివరకు దాని గురించి ఒకసారి కూడా నోరు ఎత్తలేదు , యువతకు ఉపాధి చూపించకపోతే నిరుద్యోగ భృతి అని చెప్పే మోసం చేశారు. ప్రకటనల్లో మాత్రం భారీ ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నామని చెప్పి వారి సొంత మీడియాలో డప్పు కొట్టుకుంటున్నారు తప్ప ఏ ఒక్కరికి ఉపాధి చూపించలేదన్నారు. మెగాడిఎస్సి పేరిట మోసం చేసిందని భారీ ఎత్తున యువత నష్టపోయారని తెలిపారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటాలో భారీ ఎత్తున ఉద్యోగాలు అమ్ముకున్నట్లు తెలిపారు. చంద్రబాబు మోసపూరిత ఈ రెండేళ్ల పాలనకు వెన్నుపోటు అనే నిరసన కార్యక్రమం భారీగా ఎటపాక మండల వైకాపాశ్రేణులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆకుల వెంకట రామారావు (పెద్దోడు) రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, గుండాల ఎంపిటిసి గొంగడి వెంకట



రామిరెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు దామెర్ల రేవతి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షులు తోట శశి కుమార్ మాజీ సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు సారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకుల దయాకర్ శీలం నాగేశ్వరరావు ముత్తి బోయిన రాము, చల్ల మణి మాచర్ల బాబురావు, కుచ్చులపాటి వెంకటేశ్వర్లు , చందా శేఖర్ రెడ్డి, బా రెడ్డి నరేందర్ రెడ్డి, గుజ్జుల దేవేందర్ రెడ్డి ఎర్ర గొల్ల నరసింహారావు, నోముల కృష్ణ ,మై సాక్షి రాకేష్, బారెడ్డి లక్ష్మారెడ్డి భోగాల వీరారెడ్డి, భోగాల రఘువర్ధన్ రెడ్డి సిలివేరి కోటేశ్వరరావు, కాటం స్వరూప, కొప్పుల అలివేలమ్మ, సింగిరెడ్డి గోపిరెడ్డి ఎర్ర గొర్ల రామకృష్ణ ముక్కు కల్పన, కాకాని సురేష్, కొత్తపల్లి సతీష్, కొత్తపల్లి సాత్విక్, కాకాని ఆకాష్, నడిపిండి చరణ్, ముక్కు జయరాం, మల్లు శేఖర్ రెడ్డి, చిలువేరు భద్రయ్య పల్లపు శీను, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలి:



నిర్మల్, జున్ 05(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతున్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు.

కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్డిఓ నాగిని బాను, ఇతర అధికారులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాణి.. పాటల్లో మహారాణి..

### పదేళ్ల వయసులో పాటలతో దుమ్ము దులుపుతున్న చిన్నారి అక్షర..
### ఎంత క్లిష్టమైన పాటనైనా అలవోకగా పాడే సామర్థ్యం - జర్నలిస్టు కేపీ ప్రోత్సాహంతో వెలుగులోకి
### నాలుగు భాషల్లో పాటలు పాడుతున్న అక్షర - అద్భుతః అనిపించుకున్న చిన్నారి

షాద్ నగర్ జూన్ 05 ( ప్రజా కలం ):ప్రతినిధి

రాణి ఓ రాణి.. ఓ చండీరాణి.. "ఎస్ జానకి"లా హాస్య రస గీతాలు పాడడంలో మహారాణి.. కూనలమ్మ కూనలమ్మ.. అంటూ "కేఎస్ చిత్ర" లా చక్కనైన గీతాలను ఆలపించడంలో తనది ప్రత్యేక బాణీ.. భాష ఏదైనా.. పాట ఏదైనా.. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ నాలుగు భాషల్లో ఎంత క్లిష్టమైన గీతమైన అవలీలగా పాడగలిగే సామర్థ్యం ఆమె సొంతం.. ఈమె ఎంతో వయస్సున్న కొమ్ములు తిరిగిన గాయకురాలు కాదు.. ఓ "పదేళ్ల చిన్నారి" అంటే నమ్మశక్యం కాదు.. కానీ ఆమె పాట విన్న ఎవరైనా నమ్మి తీరాల్సిందే.. ఆమె పేరు అక్షరాల "అక్షర".. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన యాదగిరి కూతురు అక్షర చిన్నతనం నుంచే తండ్రి ప్రోత్సాహంతో గాయనిగా అవతరించింది. ఇప్పుడిప్పుడే సంగీత సాధన చేస్తున్న ఈ బాలిక రికార్డుల్లో ఒక్కసారి పాట వింటే చాలు దాని నాడిని పట్టుకొని అద్భుతంగా పాడడం అలవాటు చేసుకోంది. అదే టాలెంట్ తో పలు ప్రదర్శనలలో పాల్గొని భేష్ అనిపించుకుంది. షాద్ నగర్ పట్టణంలో స్వదేశీ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాడిన పాటలు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింలు, ప్రతాప్ రెడ్డి, సినీ నటుడు టార్జాన్, కృష్ణ మహేష్ ప్రజాసేన ఆల్ ఇండియా అధ్యక్షుడు ఖాదర్ గోరి తదితరుల కరతాల ధ్వనులు చేయించాయి. ఇటీవల హైదరాబాదులో శ్రీ సరస్వతి కళా పీఠం రోజా మధిర ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూడా జర్నలిస్ట్ కేపీతో కలిసి మరోసారి రాణి ఓ రాణి అనే కామెడీ పాటతో మురిపించిన ఈ బాలిక ఆ తర్వాత పలు పాటలతో ఆకట్టుకుంది. అంతేకాకుండా తన తండ్రి యాదగిరితో కలిసి అంకుశం సినిమాలోని ఇది చేరగని ప్రేమకు శ్రీకారం అంటూ పాడిన పాట ప్రతి ఒక్కరి చేత చప్పట్లు కొట్టించింది. అతి చిన్న వయసులోనే అందనంత ఎత్తుకు ఎదుగుతున్న ఈ చిన్నారి భవిష్యత్తులో గాయనిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తుంది.

**జెనర్నలిస్ట్ కాజాపాష (కేపీ) ప్రోత్సాహంతో..**

ఎవరిలోనైనా ప్రతిభ ఉందంటే వారిని ప్రోత్సహించడానికి ఏమాత్రం ఆలోచించని జర్నలిస్ట్ కెపి దృష్టిలో



ఈ చిన్నారి గాయని పడింది. వెంటనే ఆమెను తీసుకొచ్చి సరస్వతి కళా పీఠం ద్వారా పాడే అవకాశం కల్పించారు. కళా పీఠంలో ముఖ్య సలహాదారుడుగా ఉన్న కేపీ ఈ చిన్నారి చేత పాడించిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, కన్నడ, తమిళ భాషల్లో కూడా పాటలు పాడడం ఈ చిన్నారి ప్రత్యేకత. ఎంత క్లిష్టమైన గీతమైనా ఒక్కసారి వింటే చాలు ఆ పాట నాడీ పట్టుకొని అదే రీతిలో చూడకుండా పాడి అలరించడం ఈ చిన్నారికి వెన్నతో పెట్టిన విద్య. తెలుగు గాయకుడిగా చరిత్ర సృష్టించిన ఎస్పీ బాలసుబ్రమణ్యంకు కూడా తొలినాళ్లలో సంగీతంలో ఎలాంటి ప్రవేశం లేదు. అయినప్పటికీ పాట నాడిని పట్టుకొని అదే రీతిలో పాడేస్తూ క్రమంగా సినీ రంగంలోకి వచ్చి సంగీతం పైన కూడా పట్టు పెంచుకొని గాయకుడిగా అత్యున్నత స్థాయికి ఎదిగారు. ఘంటసాల తర్వాత తెలుగు వాళ్ళు చెప్పుకునే పేరు బాలసుబ్రమణ్యంది మాత్రమే. అదే రీతిలో సంగీత సాధన లేకుండా పాటలను అలవోకగా పాడేస్తు పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు ఈ చిన్నారి భవిష్యత్తులో బాలసుబ్రమణ్యం లాగే అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆశిద్దాం.

## ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలి

### - పేట ఎంపీడీవో క్రాంతి కుమార్

మే 5, మెదక్ జిల్లా. పెద్ద శంకరంపేట్. ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో, బాధ్యతతో పనిచేయాలని ఎంపీడీవో క్రాంతి కుమార్ తెలిపారు. సాధారణ బదిలీలలో భాగంగా పెద్ద శంకరంపేట పేట మండలం నుంచి ఇతర ప్రాంతాలకు బద్ధి పై వెళుతున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతికుమార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది కృష్ణ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారు చేసిన కృషిని గుర్తుచేసివారికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అదే సమయంలో పేట మండలానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందికి స్వాగతం పలికారు. కొత్త బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ షాకీర్అలీ, ఎంపీ ఓ జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని బదిలీపై వెళ్తున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను ఆత్మీయంగా ఆహ్వానించారు.

## బదిలి పై వెల్తున్న ఏఈవో: రమేష్‌కు సన్మానం



తానూర్,జున్ 05(ప్రజా కలం):

మండలం బోల్సా క్లస్టర్ నూతన వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో)గా అంబదాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు, ఇక్కడ పని చేస్తూ ముధోల్ మండలం బ్రహ్మగావ్‌కు బదిలీ అయిన రమేష్‌ను, అలాగే నూతన ఏఈవో అంబదాస్‌ను ఝరి బి గ్రామస్తులు, నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామ వ్యవసాయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అంబదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, జాదవ్ విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ:జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

### – ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు ప్రజావాణి




గద్వాల ప్రతినిధి జూన్ 5 (ప్రజా కలం న్యూస్) జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి రోజు ( వర్కింగ్ డేస్ లో ) మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, న్యాయపరమైన సమస్యలు, ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

## పట్టపగలే దొంగతనం

### 7తులాల బంగారం రూ. 68000 నగదు. అపహరణ

నిర్మల్ జూన్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని నర్సాపూర్ (జి)లో శుక్రవారం ఎవరు లేని సమయంలో పట్టపగలే బంగారం దొంగతనం, జరిగింది. నర్సాపూర్ (జి) గ్రామంలో సుధాకర్ అనే రైతు ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు తాళం పగలగొట్టి 7తులాల బంగారం,రూ. 68000 నగదు దొంగలించినట్లు ఇంటి యజమాని సుధాకర్ తెలిపారు. యజమాని సుధాకర్ మధ్యానం తోట నుంచి రాగానే గమనించి పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతే నర్సాపూర్ (జి) ఎస్సై విచారించి కేసు నమోదు చేశారు. విచారణలో ఏ ఎస్సై శంకర్,హెడ్ కానిస్టేబుల్ ,కానిస్టేబుల్ మన్సూర్,శీను,గ్రామ సర్పంచ్ ఇంద్రకరంరెడ్డి,తదితర గ్రామస్తులు ఉన్నారు.



## గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించిన విద్యార్థిని దేవోల్ల జోయ్ అభిగేల్ ను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్.

నిర్మల్ జూన్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) 'హాలెల్ మ్యూజిక్ స్కూల్' గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన శుభసందర్భంగా జిల్లాకు చెందిన విద్యార్థిని దేవోల్ల జోయ్ అభిగేల్ ను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లోఅభిందించారు. మే 29న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి విప్లరి ఆడిటోరియంలో "గిన్నిస్ అచీవర్స్ మీట్" అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ అంతర్జాతీయ రికార్డుకు సంబంధించిన ప్రధాన కార్యక్రమం ఫిబ్రవరి 02 న హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 22 దేశాల నుండి దాదాపు రెండువేల మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొని, ఒక గంట పాటు కీబోర్డ్ ఆగకుండా వాయించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 777 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. వారిలో జిల్లాకి చెందిన దేవోల్ల జోయ్ అభిగేల్ ఉన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించి జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.



## వార్డు మెంబర్ అగ్గి ప్రసాద్ జన్మదిన వేడుకలు

**జన్మదిన సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణి**

**ఆదర్శంగా నిలిచిన 1 వార్డ్ సభ్యుడు అగ్గి ప్రసాద్**



నందిగామ జూన్ 05 ( ప్రజా కలం ):ప్రతినిధి

నందిగామ 1 వ వార్డ్ సభ్యులు అగ్గిప్రసాద్. తన పుట్టినరోజు సందర్భంగా తన మానవతా దృక్పథం చాటుకున్నాడు నందిగామ పారిశుద్ధ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి గ్రామాన్ని శుద్ధి చేసి ప్రలందరిని రోగాల బారిన పడకుండా కాపాడుతున్న పరిశుద్ధ కార్మికులకు మనమందరం తోడుగా ఉండాలని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సంపూర్ణ ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తూ తమ వంతు కృషి చేస్తున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ సిబ్బందికి తన వంతు సహాయ సహకారం అందించడం తనకు ఆత్మసంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ చాకలి నర్సింలు, వార్డు సభ్యులు అగ్గి మమతాసురేష్ గౌడ్, చించెటి లతాశివకుమార్ గౌడ్, నాయకులు అగ్గి ప్రవీణ్ , అగ్గి కృష్ణ, అగ్గి మహేష్ ,పిట్టల రాములు,బంట్రపు జంగయ్య గౌడ్, చించెటి కృష్ణ గౌడ్, ఎర్రగారి రమేష్, కేశమోని ఆంజనేయులు యాదవ్, నరేందర్ రెడ్డి (సీఎం), తడకల జంగయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నగళ్ళ అశోక్ , గ్రామపంచాయతీ పారిశుద్ధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ దరఖాస్తులను స్వీకరించిన కొయ్యురు సర్పంచ్ కొండ రాజమ్మ



మల్హార్, జూన్ 05 ప్రజాకలం ప్రతినిధి :

రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కొయ్యురు గ్రామ పంచాయతీలో నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రాజమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు మరియు వికలాంగులు ఎవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పర్వతగిరి లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు.

( వరంగల్/ పర్వతగిరి) జూన్ 5, ప్రజాకలం ప్రతినిధి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ పర్వతగిరి నందు జరిగిన గ్రామ సభ లో గ్రామ పంచాయతీ సర్పంచ్ చీదురు శంకర్ అధ్యక్షుతన నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్ పాల్గొని పర్యావరణ లో జరుగుతున్న మార్పులు గురించి వివరించి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు వాటిని అరికట్టడం మొక్కలు పెంపకం యొక్క ప్రాధాన్యత వివిరించారు. ఈ కార్యక్రమంలో గ్రామం లోని వన ప్రేమికుడు, సేవకుడు బరిగేల ఉప్పలయను సన్మానం చేయడం జరిగింది. ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత, వార్డు సభ్యులు ఇస్లావత్ హరీష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రఘు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం లు , ఆశ వర్క్ లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన దాంపతులకి ఎం హెచ్ ఎమ్ ఉద్యోగుల శుభాకాంక్షలు

**-వధూవరులను ఆశీర్వదించిన రామా రాజేష్ ఖన్నా.**

**-పాల్గొన్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగ సంఘ నాయకులు.**

వరంగల్, జూన్ 5 (ప్రజాకలం ప్రతినిధి): వరంగల్ జిల్లా శివనగర్‌లోని శ్రీరామ కళ్యాణ మండపంలో గన్నారపు దయామణి-రమేష్ దంపతుల ద్వితీయ పుత్రుడు గన్నారపు భగత్ కుమార్, వైశాలి వివాహ విందు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా హాజరై నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ కోఆర్డినేటర్ జన్ను కోర్నెల్ కూడా వధూవరులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం హనుమకొండ జిల్లా ప్రతినిధి ఓశపాక సందీప్ కుమార్, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి గూడెపు ప్రభాకర్, అజ్మీర విజయ్ నాయక్‌తో పాటు పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరి

**– ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌కు ఫైర్ ఎన్‌ఓసీ కీలకం :**

**– డీఎంహెచ్‌వో డా. బి. సాంబశివరావు.**



జూన్ 5 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి. సాంబశివరావు శుక్రవారం తన కార్యాలయ చాంబర్‌లో నర్సంపేట డివిజన్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కార్యవర్గ సభ్యులు, వైద్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలు, ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌కు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. వైద్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించిన డీఎంహెచ్‌వో డా. సాంబశివరావు మాట్లాడుతూ, యాక్ట్ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అన్ని పత్రాలను సమర్పిస్తే జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీ పరిశీలించి ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు జారీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రత్యేకంగా ఫైర్ సేఫ్టీ ప్రమాణాలపై దృష్టి సారించిన ఆయన, జిల్లా అగ్నిమాపక శాఖ నుంచి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా ఆస్పత్రుల రెన్యువల్స్ సాధ్యం కాదని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఫైర్ ఆఫీసర్ యేడ్ల నారాయణ మాట్లాడుతూ, ఫైర్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ప్రైవేట్ దవాఖానలు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిబంధనలు పూర్తిగా అమలు చేసిన ఆస్పత్రులకే ఫైర్ ఎన్‌ఓసీ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు, కార్యదర్శి, ఇతర వైద్యులు, ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు, ఫైర్ ఫైటర్ దేవేందర్‌రెడ్డి, ఎస్ఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## "చదువును కొనొద్దు... చదువుకునే అవకాశాన్ని పిల్లలకు కల్పించండి"

**– బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పందిని గ్రామ సర్పంచ్ అర్షనపెల్లి శ్రీరామ్ భూపాల్.**

**– ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు ఇంటింటి ప్రచారం.**



జూన్ 5 ప్రజాకలం ప్రతినిది: (హన్మకొండ /ఐనవోలు)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా హనుమకొండ జిల్లా అయినవోలు మండలం పందిని గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అర్షనపెల్లి శ్రీరామ్ భూపాల్ ప్రారంభించారు. ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి విద్యార్థుల చేరికల కోసం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీరామ్ భూపాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రైవేట్ పాఠశాలల పేరుతో అధిక ఫీజులు చెల్లించి అప్పుల పాలవ్వడం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఉచిత, నాణ్యమైన విద్యను అందించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. "చదువును కొనకండి... చదువుకునే అవకాశాన్ని మీ పిల్లలకు కల్పించండి" అనే సందేశంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామాభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొన్న ఆయన, ప్రతి కుటుంబం తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొని విద్య ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. గ్రామంలో విద్యా చైతన్యాన్ని పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని భాధ్యత

**– ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్లబెల్లిలో మొక్కల నాటిన పాలకవర్గం – ప్లాస్టిక్ నిర్మూలనకు గ్రామసర్పంచ్ పిలుపు**

జూన్ 5 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ సంరక్షణ కోసం మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ అత్యంత అవసరమని నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని గ్రామస్థులకు వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేసి, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవేందర్, గ్రామ కార్యదర్శి షేక్ హుస్సేన్, వార్డు సభ్యులు, గ్రామస్థాయి అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## తాడిచెర్ల ఓసీపీ గనుల్లో ఘనంగా పర్యావరణ దినోత్సవం...

**- మొక్కలు నాటిన గని సిజిఎం కొప్పిశెట్టి సత్యనారాయణ మూర్తి**

మల్హార్ , జూన్ 5 ప్రజాకలం ప్రతినిధి... భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తాడిచెర్ల-1 ఓపెన్ కాస్ట్ మైన్ అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం జూన్ 05 న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మైన్ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందింపు, ప్రకృతి సంపదల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి కేఎస్ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ జి. శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కే. సురేష్ బాబు, ఎస్టేట్ ఆఫీసర్ రామచంద్ర మూర్తి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ రామ్ కుమార్, హెచ్ఆర్ డీజీఎం రమేష్ బాబు పాల్గొన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్యం, అటవీ వినాశనం మానవాళికి సవాలుగా మారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. "ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటితే, భూమికి గొప్ప సేవ చేసినట్లే" అని పేర్కొంటూ ఓసిపి ఉద్యోగులలో చైతన్యం నింపారు.




## 99 రోజుల ప్రణాళికలో బాగంగా స్వచ్ఛ అవగాహన

**- సర్పంచ్ బండి స్వామి, కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి**



మల్హార్, జూన్ 05 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్లలో స్థానిక సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు 'స్వచ్ఛ తెలంగాణ' కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలో వేర్వేరుగా విభజించి పంచాయతీ ట్రాక్టర్లకు అందజేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించి గ్రామాలను స్వచ్ఛంగా మార్చుకోవాలని వివరించారు. అనంతరం ఉపాధి పని ప్రదేశంలో సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, వార్డు సభ్యులు ఇందారపు సారయ్య, మేనం సంగీత రాకేష్, కామ బాపు, నాయకులు కొత్తగొల్ల రాజయ్య వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, పంచాయతీ సిబ్బంది మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## బుర్ర సారయ్యకు ఘన నివాళి

**- దశదిన కర్మలో పాల్గొన్న మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు.**

జూన్ 5 ప్రజాకలం ప్రతినిది: (హన్మకొండ /ఐనవోలు) ఐనవోలు మండలంలోని నందనం గ్రామానికి చెందిన బుర్ర రాజ్‌కుమార్ తండ్రి, దివంగత బుర్ర సారయ్య దశదిన కర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొని బుర్ర సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బుర్ర సారయ్య గ్రామాభివృద్ధికి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఒంటిమామిడిపల్లి మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, చీకటి శ్రీనివాస్, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## రమా నందన పై కేసు నమోదు

రంగారెడ్డి : ఇబ్రహీంపట్నంలో ప్రముఖ యూట్యూబర్, మన శంకర వర ప్రసాద్ నటి రమా నందన అలియాస్ నందు కుటుంబంపై కేసు నమోదు అయింది. యూకే వీసా రెన్యూవల్ పేరిట రూ. 15 లక్షల టోకరా ఇచ్చినట్లు పిర్యాదు. డెస్టినీ కన్సల్టెన్సీ పేరిట వీసా రెన్యూవల్ చేస్తామంటూ నమ్మించి భారీ మోసానికి నిందితులు పాల్పడ్డారు. వెస్ట్ ఇబ్రహీంపట్నం కి చెందిన మామిళ్ళపల్లి శివక్రాంతి కుమార్ అనే బాధితుడి ఫిర్యాదుతో ఉదంతం వెలుగు చూసింది. బాధితుడు యూకే లో ఉన్న సమయంలో వీసా గడువు ముగిసిపోతుండటంతో డెస్టినీ కన్సల్టెన్సీ నిర్వాహకులను ఆశ్రయించిన వైనం. ఇండియాకు చెందిన తమ బ్రాంచ్లో డబ్బులు చెల్లిస్తే వీసా ప్రాసెస్ చేస్తామని కేటుగాళ్లు నమ్మబలికారు. నిందితుల మాటలు నమ్మి రూ. 15 లక్షల వరకు బాధితుడు కుమార్ చెల్లించాడు. నెలలు గడుస్తున్నా వీసా రాకపోవడంతో పాటు నిందితులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో బాధితుడి ఫిర్యాదు ఆధారంగా నిందితులపై క్రైమ్ నంబర్ 515/2025 కింద కేసు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసారు. డెస్టినీ కన్సల్టెన్సీ డైరెక్టర్ జాగర్లమూడి మధుకర్, ఆయన భార్య రమానందన మరియు గుంటూరులో ఉండే మధుకర్ తండ్రి పై కేసు నమోదు అయింది. ఈ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ బి.రాజు వెల్లడించారు.

# ఏనుమాముల మార్కెట్‌కు కొత్త దిశ

**నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుభాకాంక్షలు – రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సూచన.**

వరంగల్ జూన్ 5 (ప్రజాకలం ప్రతినిధి):

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎర్ర ప్రియాంక-పులి అనిల్ కుమార్, డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గ్యాదరబోయిన రాజు (రైతు రాజు) శుక్రవారం హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు నూతన చైర్మన్ ఎర్ర ప్రియాంక-పులి అనిల్ కుమార్, డైరెక్టర్ రైతు రాజును శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. అలాగే డైరెక్టర్ రైతు రాజు కూడా చైర్మన్ ఎర్ర ప్రియాంక-పులి అనిల్ కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం నూతన పాలకవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, పారదర్శక సేవలు అందించడంలో వ్యవసాయ మార్కెట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ అభివృద్ధి, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పాలకవర్గం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బిజిలి సంపత్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పచ్చదనమే ప్రగతికి పునాది..

-కర్దనూర్ కాలనీలో భారీగా మొక్కల నాటకం..
-పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం కీలకం..
-ప్రతి కుటుంబం ఒక మొక్క నాటాలని పిలుపు..
-హరిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు కాంగ్రెస్ ప్రభుత్వం..



పటాన్‌చెరు, జూన్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్ చేరు ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్దనూర్ 2బిహెచ్‌కే కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శాపురం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాపురం నరసింహారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని సూచించారు. తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరితాభివృద్ధి సాధ్యమవుతుందని, చెట్ల పెంపకమే పర్యావరణ సంక్షోభానికి శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ అంకితభావాన్ని చాటారు..



# తెలంగాణ ఉద్యమ వీరుడికి వందనం..

పటాన్‌చెరు, జూన్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్ చేరు తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని జీ. ఎల్లయ్య ఎన్‌క్లేవ్‌లో తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ కార్మిక నాయకుడు జీ. ఎల్లయ్య 85వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన, కాలనీ నామకరణం, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాలు ఆయన కుమారుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగాయి. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఎల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వి. భూపాల్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, వి. ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం, కార్మిక హక్కుల సాధనలో జీ. ఎల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో తొంట అంజయ్య, పాండురంగారెడ్డి, దేవేందర్ యాదవ్, లచ్చిరాం నాయక్, బాబ్జి, కాంజర్ల శ్రీశైలం, సాయి చరణ్ గౌడ్, నారాయణరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, పాండు, కాటా సునీత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..



# లో వోల్టేజ్‌కు చెక్...ఇస్నాపూర్‌కు పవర్ బూస్ట్

## -ఇస్నాపూర్‌కు 4 కొత్త ఉపకేంద్రాలు..
## -రూ.130 కోట్ల కొల్లూరు ఉపకేంద్రానికి గ్రీన్ సిగ్నల్..



పటాన్‌చెరు, జూన్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో వేగంగా విస్తరిస్తున్న కాలనీల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేసేందుకు ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో నాలుగు నూతన విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజలకు లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ శాఖ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీతో పాటు నాగులపల్లి, వెలిమెల, కొల్లూరు, భానూరు, నందిగామ, క్యాసారం ప్రాంతాల్లో భారీ స్థాయిలో కొత్త కాలనీలు ఏర్పడుతున్న నేపథ్యంలో విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలు లో వోల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడకుండా అవసరమైన చోట్ల విద్యుత్ మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కర్దనూర్, వెలిమల తాండా, నాగులపల్లి డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం, పాశమైలారం ప్రాంతాల్లో కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు త్వరలోనే స్థలాలు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులతో చర్చలు జరుపుతామని తెలిపారు. ముత్తంగి ప్రాంతంలోనూ మరో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కొల్లూరు ప్రాంతంలో రూ. 130 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రానికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు, స్థల కేటాయింపు పూర్తయ్యాయని, పనులు వెంటనే ప్రారంభించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. లకడారం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ నెహ్రూ నాయక్, సహాయ డివిజనల్ ఇంజనీర్ తులసీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు..

## గీతంలో క్వాంటం సాంకేతికపై పరిశోధన

# జేఆర్‌ఎఫ్ కోసం ఆహ్వానం

## ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలి

పటాన్ చేరు జూన్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

క్వాంటం టెక్నాలజీల కోసం షట్కోణ బోరాన్ నైట్రైడ్ లో రుణాత్మక ఆవేశం గల ఏక బోరాన్ ఖాళీల నిర్ధారిత సృష్టి, లక్షణాల నిర్ధారణ ప్రాజెక్టును హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం చేపట్టింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్టీ) నిధులతో కూడిన ఈ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. అత్యాధునిక నానోఫ్యాబ్రికేషన్ పద్ధతులను ఉపయోగించి షట్కోణ బోరాన్ నైట్రైడ్ (h-BN)లో క్వాంటం లోపాలను సృష్టించడానికి, అధ్యయనం చేయడానికి అధునాతన పద్ధతులను అభివృద్ధి చేయడంపై ఈ ప్రాజెక్టు దృష్టి పెడుతుందని వివరించారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీస్ రంగానికి దోహదపడేలా, విస్తృతమైన స్పెక్ట్రోస్కోపిక్, మైక్రోస్కోపిక్ లక్షణీకరణ ద్వారా క్వాంటం ఉద్గార ధర్మాలను అన్వేషించడమే ఈ పరిశోధన లక్ష్యమన్నారు. ఐఐటీ బొంబాయి, రోమ్ (ఇటలీ)లో ఉన్న సాపియెంజా విశ్వవిద్యాలయాల సహకారంతో ఈ ప్రాజెక్టును గీతం హైదరాబాదులో నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థికి అధ్యాపకులు, పోస్ట్ డాక్టోరల్ పరిశోధకులు, డాక్టోరల్ స్కాలర్లతో కూడిన అంతర్జాతీయ పరిశోధన బృందంతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో బీటెక్ లేదా ఎంటెక్ అర్హతలు కలిగి, సెమీకండక్టర్ పరికరాలు, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ లో బలమైన పునాది ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేట్ అర్హత, మునుపటి ప్రయోగాత్మక పరిశోధన అనుభవం, XRD, SEM, AFM, ఫోటోల్యూమినిసెన్స్ (PL), రామన్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన క్యారెక్టరైజేషన్ టెక్నిక్ లపై పరిచయం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు మూడేళ్ల కాల పరిమితి ఈ జేఆర్‌ఎఫ్ కు అర్హతను బట్టి ఫెలోషిప్ అందించబడుతుందని, తొలి రెండేళ్లు నెలకు 37 వేల రూపాయలతో పాటు ఇంటి అద్దె, మూడో ఏడాది సీనియర్ రీసెర్చ్ ఫెలోగా నెలకు 42 వేల రూపాయలు, హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడి (పీఐ)గా డాక్టర్ శాంతను సాహా నాయకత్వం వహిస్తారని, ఈ ప్రాజెక్టు కోసం 45.43 లక్షల రూపాయల గ్రాంటు డీఎస్టీ మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యా నేపథ్యం, పరిశోధన అనుభవాన్ని వివరిస్తూ, తాజా బయోడేటాకు ఒక సంక్షిప్త లేఖను జతచేసి ంయిష్ట్రు2ఏస్త్రుఊఎ.వసబ కు పంపాలన్నారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని, ఇంటర్వ్యూలు ఈనెల చివరిలో, లేదా జూలై ప్రారంభంలో నిర్వహిస్తామని తెలిపారు. తక్షణమే విధులలో చేరగల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు ఎంపికైన అభ్యర్థి పనితీరు, ప్రాజెక్టు అవసరాలు, పరస్పర అంగీకారం ఆధారంగా, ఈ పదవిలో పీహెచ్.డీ. చేసే అవకాశాలు కూడా ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


# చెత్త సేకరణ పేరుతో ప్రజలపై అదనపు భారం వద్దు

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రైవేటీకరణ నిర్ణయంపై కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆగ్రహం

గజ్వేల్ :05 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రజల నుంచి ఇప్పటికే పన్నులు, యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్న మున్సిపాలిటీ.. ఇప్పుడు చెత్త సేకరణ పేరుతో మరోసారి వారి జేబులకు చిల్లులు పెట్టే ప్రయత్నం చేస్తోందా? అనే ప్రశ్నలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో తలెత్తుతున్నాయి.చెత్త సేకరణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తూ పరోక్షంగా ప్రజలపై అదనపు భారం మోపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా, చెత్త సేకరణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రతిపాదనను గతంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పూర్తిగా పక్కనపెట్టి అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని వార్డుల్లో ఇప్పటికే ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్త సేకరణ చేపడుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇది ప్రజాసేవ కంటే ఆదాయ వనరుగా మార్చే ప్రయత్నంగా కనిపిస్తోందని విమర్శించారు.

మున్సిపాలిటీకి ప్రజలు ప్రతి సంవత్సరం ఆస్తి పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక సేవలకు అదనపు చార్జీలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించడం మున్సిపల్ శాఖ ప్రాథమిక బాధ్యత అని, చెత్త సేకరణ వంటి అత్యవసర సేవలను కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ఆర్థిక భారం



మోపే విధానాలను వెంటనే విరమించుకోవాలని,లేకపోతే ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపాలిటీ నిర్వహించాల్సిన పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల పారదర్శకత దెబ్బతినడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని సేవలపై కూడా అదనపు ఛార్జీల భారం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజాసేవను వ్యాపారంగా మార్చకుండా పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి, యాదగిరి, నక్క సంతోష్, రాములు గౌడ్,లక్ష్మీ శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రమేష్ నాయక్, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

గజ్వేల్:05 జూన్ ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ మండలంలోని కొలుగూరు గ్రామంలో శుక్రవారం విస్తృతంగా మొక్కలు నాటారు.గ్రామంలోని వైకుంఠధామం సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొడుగు జ్యోతి స్వామి,ఉపసర్పంచ్ లక్ష్మణ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నరసింహులు గౌడ్, సత్యం,ఎల్లవ్వ,కవిత, గజ్వేల్ మండల బీసీ సెల్ అధ్యక్షులు పురం ఆంజనేయులు,గ్రామ కార్యదర్శి,ఆశా వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు,కారోబార్ కనకయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్, గ్రామ సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక కలిసి పని చేయాలి

### మహేశ్వరం కిసాన్ మోర్చా మండల కమిటీ ఎన్నిక

### కిసాన్ మోర్చా మహేశ్వరం మండల అధ్యక్షులు. ఎర్ర పాండు

మహేశ్వరం, జూన్ 05,(ప్రజా కలం)

పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక కలిసి పని చేయాలని కిసాన్ మోర్చా మహేశ్వరం మండల అధ్యక్షులు ఎర్ర పాండు అన్నారు. భారతీయ జనతా



పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షులు ఈ తెలగమల్ల యాదిష్ ఆదేశాల మేరకు కిసాన్ మోర్చా మహేశ్వర మండల అధ్యక్షులు ఎర్ర పాండు ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా మండల పూర్తి కమిటీ నియమించడం జరిగింది. ఉపాధ్యక్షులు గా చిందం జంగయ్య, బండ మహేందర్, తల్లారి రమేష్, కాట్రావత్ సూర్య, ప్రధాన కార్యదర్శులుగా బుగ్గని దేవేందర్, గుర్రంపల్లి మల్లేష్, కార్యదర్శులుగా తెరటి అరవింద్, బండారి బాలరాజు, పులిమామిడి సత్యనారాయణ గౌడ్, ధైతారం రవీందర్ రెడ్డి, గార్లు కార్యవర్గ సభ్యులుగా కొత్తపల్లి నందు, నందుపల్లి ప్రవీణ్ ని నియమించడం జరిగిందని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### -పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత.. గజ్వేల్ సిఐ రవి కుమార్

గజ్వేల్:05 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ



అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు ప్రతి ఒక్కరు ఒక మొక్క' నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## ఆర్మీకి ఎంపికైన యువకులను అభినందించిన పోలీసులు.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 05.

దౌల్తాబాద్ మండలానికి చెందిన ఆర్మీకి ఎంపికైన యువకులు బ్యాగరి రవీందర్, పొగాకు ప్రసాద్, బాషమైన అఖిల్ దొమ్మాట, బండారి గౌతమ్ (తిరుమలాపూర్)లను తోగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆర్మీలో చేరడం దేశ సేవలో భాగంగా ఎంతో గౌరవప్రదమైన విషయమని వారికి వివరించారు. విధి నిర్వహణ సమయంలో పాటించాల్సిన క్రమశిక్షణ, నియమ నిబంధనల గురించి సూచనలు అందించారు. దేశ రక్షణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తూ యువకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# 50వ రోజుకు చేరిన రిలే దీక్షలు

## -వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తాం

## -టి జి ఐ ఐ ఎస్ అధికారుల హామీ

మహేశ్వరం, జూన్ 05,(ప్రజా కలం)

2004లో ఫ్యాబ్ సిటీ పేరుతో మన వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం. గత 22 ఏళ్లుగా రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.

సిపిఐ(ఎం) పార్టీ నాయకత్వం ప్రతి రోజు ఫ్యాబ్ సిటీ రైతుల భూపోరాటానికి అండగా ఉన్న సిపిఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదన్న రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు దుబ్బాక రాంచందర్ మహేశ్వరం మండల కార్యదర్శి శేఖర్, ఫ్యాబ్ సిటీ భూనిర్వాసితులు గోదాసు నర్సింహా, పాలకూర్ల నాగేష్, ఫ్యాబ్ సిటీ భూ నిర్వాసితులు గత 9 నెలల నుండి సీపీయం పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకత్వం ఫ్యాబ్సిటీ రైతులకు వెన్నంటే ఉంటూ ధైర్యాన్నిస్తూ పోరాటం చేయడంతో కొంతవరకు మనకు ఇండ్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన విషయం మనందరికీ తెలిసిందే. కొంతమంది రైతులు ఇండ్ల రిజిస్ట్రేషన్ ఆపాలనే ఉద్దేశంతో స్టేటస్కో తీసుకురావడంతో ఈ రిజిస్ట్రేషన్ నిలిపివేయడం జరిగింది.

సిపిఎం పార్టీ వెంటనే స్పందించి ఫ్యాబ్సిటీ రైతులు రిలే దీక్షలు చెయ్యాలని నిర్దేశించడంతో దీక్షలు ప్రారంభమయ్యాయి.

50 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించకపోవడంతో టి జి ఐ ఐ ఎస్ దగ్గర ధర్నాలు చేసి అధికారులను నిలదీయడం జరిగింది. టి జి ఐ ఐ ఎస్ ఎండీ శశాంక్ ఐఏఎస్ ని కలిసి స్థల మార్పిడి కోసం ఒత్తిడి చేయడం జరిగింది. ఎండి స్పందించి వారం రోజులలో సమస్యను పరిష్కారం అయ్యేవిధంగా ప్రయత్నం చేస్తామన్నారు. టి జి ఐ ఐ ఎస్, అధికారులు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు ఇంటి స్థల మార్పిడి రిజిస్ట్రేషన్ కు చివరికి నిర్ణయం తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది.

### జాతీయ రహదారి-65పై పకడ్బందీ

# భద్రతా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ .

### - సంగారెడ్డి--పటాన్‌చెరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.



సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 5:(ప్రజా కలం):

జాతీయ రహదారి-65పై సంగారెడ్డి నుండి పటాన్‌చెరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు, వాటర్ లాగింగ్ పాయింట్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల తరలింపు, నీటి పైప్‌లైన్ల షిఫ్టింగ్, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేసి మూసివేయాలని చెప్పారు. అవసరమైన చోట వాటర్ పైప్‌లైన్లను వెంటనే షిఫ్ట్ చేయడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు.

రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్, యుటిలిటీల షిఫ్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే రోడ్డు విస్తరణకు ప్రభావితమవుతున్న నివాస భవనాల యజమానులకు పరిహారం చెల్లించి తొలగింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారికి ఇరువైపులా ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెద్దాపూర్ పట్నం డాబా ఎదురుగా ఉన్న కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కల్వర్టు వెంట్లను ముందుగానే శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల డీఈఈ రామకృష్ణ, ఈఈ శ్రవణ్ ప్రకాష్, జీఎం రమేష్, ఆర్‌కేసీపీఎల్ కాంట్రాక్టర్ జయప్రకాష్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, ఆర్డిఓ, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కుమ్మరుల సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా హన్మంతు రాజు నియామకం.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 05.

తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్ర ఉప సర్పంచ్ హన్మంతు రాజును నియమిస్తూ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అమరవాది సారంగపాణి, రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతు రాజు విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర యూత్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సంఘం వ్యవస్థాపకుడు ఆకారం మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కుమ్మరులకు తగిన ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన యూత్ కమిటీలను ఏర్పాటు చేసి కుమ్మర యువతను చైతన్యపరచడమే తమ లక్ష్యమన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కుమ్మరులను సంఘటితం చేసి వారి హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు.

చిన్న వయసులోనే రాష్ట్ర యూత్ కమిటీలో పదవి రావడం ఆనందంగా ఉందని, అదే స్ఫూర్తితో సమాజ అభివృద్ధి మరియు హక్కుల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానని హన్మంతు రాజు పేర్కొన్నారు.

## ప్రకృతిని రక్షిస్తే.ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుంది

### ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్ జూన్ 05,(ప్రజా కలం)

కాటేదాన్ డివిజన్ బృందావన్ కాలనీలో భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటే



కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు నిర్వహిస్తూ ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ ఉద్యమం, తమ తల్లిని గౌరవించటానికి ఒక మొక్కను నాటమని పౌరులను ప్రోత్సహిస్తుంది ప్రకృతిని కూడా మన తల్లిని చూసుకున్నంత ప్రేమ, శ్రద్ధతో చూసుకోవాలని ఈ భావన ప్రోత్సహిస్తుంది అని ప్రతి ఒక్కరి ఏ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తమ వంతు బాధ్యతగా చేపట్టాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల భాస్కర్,సంతుగౌడ్, బొమ్మరాజు నరసింహ, శ్రీకాంత్ రెడ్డి,రమణ రమేష్ రెడ్డి, శేఖర్ మజార్ కిరణ్ రాజ్ స్వామి రామారావు శంకర్ రెడ్డి సానిటేషన్ సూపర్వైజర్ వారి సిబ్బంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి.

## -నారాయణఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్ ఉమా హారతి.

## - ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం.



సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 5:( ప్రజా కలం ): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయ సంయుక్తంగా నారాయణఖేడ్‌లో పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృక్షారోపణను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజలు ఎకో పార్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు పచ్చదనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, అటవీ సంపద పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వృక్షారోపణ కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కాగితంతో తయారైన ఉత్పత్తులు, పునర్వినియోగ పదార్థాలు, స్టీల్ వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, పేపర్, క్లాత్, జనపనార (జూట్) సంచులు, చెక్కతో తయారైన స్పూన్లు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రదర్శించారు. రోజువారీ జీవితంలో వీటి వినియోగం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను అధికారులు, ప్రజలతో చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం కోసం కృషి చేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని వరుణ్ బేవరేజెస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎద్దుమైలారం ఓడీఎఫ్ స్థలం, పాశమైలారం జేకే ఫెన్నర్ సంస్థలలో నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమాల్లో కూడా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే స్థిరమైన జీవన విధానాలను అలవరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## 48 లక్షలతో నీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, జూన్ 05, (ప్రజా కలం)

కిస్మత్‌పూర్ సెక్షన్ పరిధిలోని శివాలయ టెంపుల్ నుండి హిమగిరి నగర్ రోడ్ నెం.07 వరకు త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నూతన పైప్‌లైన్ పనులకు రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన వేశారు. ఇకనుండి ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య తీరనుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన నీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో లక్ష్మి డీజీఎం జవహర్ అలీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

**వేములవాడ, జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి):** సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు. శుక్రవారం వేములవాడ లోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బుస్స దశరథం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బుస్స దశరథం మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. నూతన కార్యవర్గం ఐక్యతతో ముందుకు సాగి జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసయ్యలు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌తో పాటు సంఘం ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ అందించిన ప్రోత్సాహం తమపై మరింత బాధ్యతను పెంచిందని, పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు కొత్వాల్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు రసూల్, ఉపాధ్యక్షులు చింతలతాడెం దేవరాజ్, విష్ణు, జిల్లా సభ్యులు కంటాల విజయ్, క్యాషియర్ పంపరి నాగరాజు, దెబ్బేటి ప్రవీణ్, ప్రదీప్ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు చికోటి అశోక్, బుస్స బుచ్చిబాబు, దైత కుమార్, ఆర్యవైశ్య నాయకులు చేపూరి రవీందర్, చేపూరి గణేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చైతన్యమే పార్టీకి బలం

**-సుశిక్షిత కమ్యూనిస్టులుగా ఎదగాలి**

**- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**





వేములవాడ, జూన్ 05 ప్రజా కలం ప్రతినిధి : దేశంలో రోజురోజుకూ మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ సుశిక్షిత కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. రాజకీయ శిక్షణా శిబిరాలు కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వేములవాడలోని మహందీశ్వర బ్యాంకెట్ హాలులో శుక్రవారం ప్రారంభమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కౌన్సిల్ సభ్యుల మూడు రోజుల రాజకీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ, జాతీయ, రాష్ట్ర స్థాయి పరిణామాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు రాజకీయ శిక్షణ అవసరమన్నారు. కార్యకర్తలను సమర్థ నాయకులుగా తీర్చిదిద్దడంలో ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రాజకీయ శిక్షణా శిబిరాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాల్లో మార్పులు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర పథకాల నిధుల విషయంలో రాష్ట్రాలపై అదనపు భారం మోపుతోందన్నారు. తెలంగాణలో మతోన్మాద రాజకీయాలకు అవకాశం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజల మధ్య విభేదాలు సృష్టించే వ్యాఖ్యలు సమాజానికి హానికరమని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ వేములవాడ నియోజక వర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్ , కె.వి.అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్ మధ్యలో మొక్కలు నాటండి

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్.

**రాజన్న సిరిసిల్ల, జూన్ 05 ప్రజాకలం ప్రతినిధి:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆద్వర్యంలో జంక్షన్



సుందరీకరణ, జోట, వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు సంబంధించిన విగ్రహాలు, గ్రీనరీ, మొక్కల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా, శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు చెందిన విగ్రహాలు ఏర్పాటు చేయగా. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులను అభినందించారు. జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సూచించారు. త్వరితగతిన అన్ని సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, డీఈ వాణి, తదితరులు ఉన్నారు.

## మహేశ్వరంలో ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

# పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేందర్ ముదిరాజ్ ప్లాస్టిక్ నిషేధంపై వినూత్న ప్రచారం
- ప్లాస్టిక్ ని వాడకూడదంటూ మటన్ షాప్ కి వెళ్లి మటన్ టిఫిన్ బాక్స్ లో తెచ్చుకున్న
- మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్





**మహేశ్వరం, జూన్ 05, (ప్రజా కలం)** మహేశ్వరంలో ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్ వినూత్న ప్రచారం మొదలు పెట్టారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేందర్ ముదిరాజ్ మహేశ్వరంలో ప్లాస్టిక్ వాడకూడదంటూ మటన్ షాప్ కు టిఫిన్ బాక్స్ తీసుకెళ్లి మటన్ బాక్స్ లో తీసుకొని వచ్చే అందరికీ ఆదర్శంగా నిలిచారు మహేందర్ ముదిరాజ్ తాను ఒక్కడినే కాకుండా మహేశ్వరం గ్రామంలో ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకుండా తమ బాధ్యతగా ప్రతి ఒక్కరు టిఫిన్ బాక్సులు ఇతర వాటిను ఉపయోగిస్తూ ప్లాస్టిక్ నిషేధించడానికి ప్రతి ఒక్కరు సహకారం చేయాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ నిత్యం వాడడం వల్ల ఎన్నో ప్రమాదాలు వస్తున్నాయని అంతేకాకుండా పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిందని భవిష్యత్తులో ప్లాస్టిక్ కారణంగా ఎన్నో ప్రమాదాలు అనారోగ్యానికి ఎన్నో కారణాలుగా ప్లాస్టిక్ తయారవుతుందని పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించేంత వరకు ప్రతి ఒక్కరు విధిగా బాధ్యతగా సహకారం అందించాలని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ని వాడకుండా ఉండడానికి ప్రయత్నం చేయాలని మహేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. నా ఒక్కడితో మొదలైన ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఒక్కరు మొదలుపెట్టి ప్లాస్టిక్ అంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. మనం వాడి వదిలేస్తున్న ప్లాస్టిక్ పశువులు గోవులు తిని మరణిస్తున్నాయని దీనివల్ల మరింత పర్యావరణం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోవులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆవులు దేవతల తో సమానం గోవులను పూజించాలి కానీ భక్షించకూడదని మహా పాపం అవుతుందని అన్నారు. మహేశ్వరంలో ప్లాస్టిక్ నిర్మూలన కోసం నిరంతరం కృషి చేస్తారని మహేందర్ ముదిరాజ్ అన్నారు. నేను మొదలు పెట్టిన మార్పు గ్రామం మొత్తం మార్పు చెందే వరకు నిరంతరం కృషి చేస్తానని మహేందర్ ముదిరాజ్ అన్నారు. ప్లాస్టిక్ అంతమవుతేనే మనందరి ఆరోగ్యాలు మెరుగుపడతాయని ప్లాస్టిక్ తోనే మన అందరి అనారోగ్యానికి కారణం అవుతుందని ప్లాస్టిక్ నిషేధితం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని మహేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

# ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**-వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేసిన**

**-సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి**




**మహేశ్వరం, జూన్ 05,(ప్రజా కలం):** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భారత ఎన్నికల సంఘం (ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా) ఆధ్వర్యంలో చేపట్టబోతున్న ప్రత్యేక ఓటరు సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ -- సార్) ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులను కోరారు. ముఖ్యంగా ఓటరు జాబితా తయారీ, సవరణ దశల్లో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని పార్టీలకు సమాన సమాచారం అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరపున బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ రెడ్డి ఇతర నాయకులతో కలిసి వినతి పత్రాన్ని జిల్లా అధికారి ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి అందజేశారు. ఓటరు జాబితా సవరణలో గ్రామ స్థాయి నుంచి డేటా సేకరణ వరకు ప్రతి దశను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఓటర్ల పేర్లు తొలగింపు లేదా కొత్త నమోదు ప్రక్రియలో ఎటువంటి పక్షపాతం చోటుచేసుకోకూడదని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు(దీూా) సరైన సమాచారం, సహకారం అందించాలని కూడా వారు కోరారు. జిల్లా అధికారులు అన్ని సూచనలను పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పుట్టా రాంరెడ్డి, సయ్యద్ ఖలీల్, జైపాల్ రెడ్డి, రామిడి రాంరెడ్డి, చుక్కా నిరంజన్, దోనాదుల కుమార్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




మహేశ్వరం, జూన్ 05,(ప్రజా కలం)

ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డితో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సార్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు వాటిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు తుది జాబితాలో ఉండకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరునామా మార్పులు, వివరాల సవరణలు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఇంటింటి గణన సందర్భంగా ఫారం-6 మరియు డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల పూరణకు టోల్ ఫ్రీ నంబర్ 1950, ఓటర్ పోర్టల్ మరియు ఈసీఐనెట్ యాప్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సరిత, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా జక్కం అశోక్ ఏకగ్రీవ ఎన్నిక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 31:

మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ (B.C) సెల్ అధ్యక్షులుగా జక్కం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతానికి, బీసీ సామాజిక వర్గాల సంక్షేమానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా జక్కం అశోక్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఇంతటి కీలకమైన పదవిని అప్పగించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ గారికి, అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మండలంలో పార్టీ అభివృద్ధికి శ్రమిస్తానని, బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు. అశోక్ గారి ఎన్నిక పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## ముంబైలో నిజామాబాద్ జిల్లా వలసజీవి అంత్యక్రియలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 31:

మాల సమాజం కార్యకర్త, దివంగత బత్తుల నడ్పి గంగారం అలియాస్ శాస్త్రి ఆదివారం ఉదయం 5:గం.లకు అనారోగ్యంతో ముంబైలో మృతి చెందారు.



వీరు జిల్లా నిజామాబాద్ ఎర్గట్ల మండలం తోర్తి గ్రామ వాస్తవ్యులు. వీరు ముంబైలో బెస్ట్ లో పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఐతే అదే రోజు ఆయన శవయాత్ర సొంత నివాసం ప్రతిక్ష నగర్లోని "మహాభోధి బుద్ధ విహార్" నుంచి బయలుదేరి సాయన్ శ్మశానభూమిలో దుఃఖబరితంగా వీడుకోలు జరిగాయి. అనంతరం శోకసభలో ముంబై తెలుగు మాల సేవ సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల లింగం, అధ్యక్షులు కె. సాయన్న ఆయన స్వభావాన్ని జ్ఞాపకం చేసుకుంటూ, వారి ఫ్యామిలీకి అన్ని రకాల చేదోడు వాదోడుగా ఉండాలని ప్రజల్ని కోరారు. ప్రత్యేకంగా నిజామాబాద్ జిల్లా నుంచి విచ్చేసిన మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎం.ఈ.ఓ) నేరా ఆంధ్రయ్య జైభీంతో మాటలు మొదలు పెట్టి వారి బావ (శాస్త్రి) గురించి పలు ఆవిష్మరణీయ జ్ఞాపకాలు విచ్చేసిన ప్రజలకు తెలియజేశారు. అనంతరం లింగం గారు జరగబోయే "దిసాల" కు హాజరుకావాలని శాస్త్రి కుటుంబ సభ్యుల తరపున బంధుమిత్రులకు విజ్ఞప్తి చేశారు. ఆ కార్యక్రమం ప్రతిక్షనగర్ అల్మెడ కాంపౌండ్ లోని దివంగత శాస్త్రి గారి నివాసంలో మంగళవారం సాయంత్రం 7:00గంటలకు ఉంటుందని సవినయంగా తెల్పారు.




## ఐకేపీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

### సమ్మెకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇత్వర్ పేట్ లింగన్న పూర్తి మద్దతు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 31:

బాల్కొండ మోడల్ స్కూల్ కేంద్రంగా ఐకేపీ ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇత్వర్ పేట్ లింగన్న ఆదివారం (మే 31, 2026) నాడు ప్రత్యక్షంగా హాజరై తమ



పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. ఐకేపీ ఉద్యోగులు గత కొన్ని రోజులుగా తమ న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. సమ్మెలో కూర్చున్న మహిళా ఉద్యోగులలో 99 శాతం మంది, అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసేవారిలో 100 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందినవారేనని ఆయన గుర్తుచేశారు. వెనుకబడిన, దళిత, గిరిజన వర్గాల సమస్యల పట్ల ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో అంబేద్కర్ వాదులు, సామాజిక కార్యకర్తలు, అభ్యుదయవాదులను ఏకం చేసి ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఉద్యోగులు, సంఘం ప్రతినిధులు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైస్తవులపై దాడులు అరికట్టాలి - ప్రకాశ్ అంబేడ్కర్



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 05 :

క్రిస్టియన్ సమాజ్ అన్యాయ్ అత్యాచార్ నివారణ్ కృతి సమితి–మహారాష్ట్ర ఆధ్వర్యంలో క్రైస్తవులపై నిత్యం సాగుతున్న వేధింపులు దాడులను అరికట్టాలని శుక్రవారం ముంబై ఆజాద్ మైదాన్లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26ప్రకారం ప్రతి పౌరుడికీ తన మనస్సాక్షి ప్రకారం ఏ మతాన్నైనా ఆచరించే, పాటించే, దానిని వ్యాప్తి చేసే స్వేచ్ఛ ఉందని, తాము రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నామని క్రైస్తవ పెద్దలు అన్నారు. అయితే ముంబై తోసహా ఇటీవల పాల్ఘర్ జిల్లాలో 5దాడులు క్రూరంగా జరిగాయి. చర్చిలు పాస్టర్లపై బజరంగ్ దళ్, వి.ఎచ్.పి వారిచే ఉద్దేశపూర్వకంగా దాడులు జరిగాయని, ఈ విద్రోహ శక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర సర్కార్ కు వారు డిమాండ్ చేశారు. "మతమార్పిడి" పేరుతో మంత్ర విద్య ఇతర చట్టాల క్రింద తమ పాస్టర్ల పై అబద్ధపు కేసులు నమోదు చేయబడ్డాయి. వాటిని వెనక్కి తీసుకోవాలన్నారు. క్రైస్తవులకు వ్యతిరేకంగా జరిగే హింస, బెదిరింపులు, వివక్షత సంఘటనలపై వేగంగా చర్యలు తీసుకోవాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన వన్చిత్ బహుజన్ అఘాడి జాతీయ అధ్యక్షులు ప్రకాశ్ అంబేద్కర్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. క్రైస్తవులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని ఆయన హామీచ్చారు. సభలో తెలుగు క్రైస్తవులు పాల్గొనడం విశేషం.

## యువతకు వాలీబాల్ కిట్ అందజేసిన గుమ్మిర్యాల్ సర్పంచ్, ఉప సర్పంచ్నాగేంద్ర నగర్:



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 05:

మండల పరిధిలోని నాగేంద్ర నగర్ గ్రామ యువకుల అభ్యర్థనపై గుమ్మిర్యాల్ సర్పంచ్ జమున సంజీవ్ యాదవ్, నాగేంద్ర నగర్ ఉప సర్పంచ్ షేక్ జాకీర్ తక్షణమే స్పందించారు.

యువకులు వాలీబాల్ ఆట ఆడుకోవడానికి అవసరమైన వాలీబాల్, నెట్‌ను వారికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ షేక్ జాకీర్ మాట్లాడుతూ.. యువత కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. ఆటలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, లక్ష్యంతో తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. తమ అభ్యర్థనను మన్నించి వెంటనే క్రీడా సామగ్రిని సమకూర్చిన సర్పంచ్ జమున సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ షేక్ జాకీర్‌లకు నాగేంద్ర నగర్ యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎర్రాజీ హరీష్, గ్రామస్థులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వలిగొండ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

### - పోలీస్ స్టేషన్ లో మొక్కలు నాటిన జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్




వలిగొండ జూన్ 5 ప్రజాకలం:పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి సిబ్బందితో యూనిఫామ్ ధరించే విధానం విధుల గురించి మాట్లాడారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ లో రికార్డులను,పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రిసెప్షన్ లాకప్ టెక్నికల్ రూమ్ పరిసరాలను పరిశీలించారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీని తనిఖీ చేసి వారి విధులను గురించి విచారించారు.

సైబర్ నేరాల యొక్క పాత కేసు వివరాలను కంప్యూటర్లో తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీలో పనితీరును అడిగి తెలుసుకున్నారు. రౌడీషిటర్ల యొక్క రికార్డును సైతం పరిశీలించి వారి ప్రవర్తన గురించి అడిగారు. రికవరీ వాహనాలను పరిశీలించి క్రైమ్ నెంబర్ ని వాటిపైన వేసి నేరాలు ఆధారంగా ఆర్డర్లు పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయండి

### డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

### పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి జూన్ 5(ప్రజాకలం న్యూస్)

ఈ నెల 7వ తేదీన ఉప్పల్ బగాయత్‌లో రూ. 99 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో పర్యటనను జయప్రదం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉప్పల్ బగాయత్‌లో జరుగుతున్న ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహా రెడ్డి,బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదిక, పార్కింగ్, తాగునీరు,భద్రత, రాకపోకల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా ముందుకు



తీసుకెళ్తోందని అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాలుస్తున్నాయని, ఎంఎంసీ నూతన భవనం నిర్మాణం ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.



## తిమ్మాపూర్ బుద్ధ విహార్‌లో ఘనంగా పౌర్ణమి వేడుకలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 31:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని మోక్షానంద బుద్ధ విహార్ లో అధిక జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ధమ్మ ప్రబోధన నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని పీఠం వద్ద దీపారాధన చేసి, పుష్పాలు సమర్పించి సామూహిక బుద్ధ వందనం, ధమ్మ వందనం, సంఘ వందనం చేశారు. అనంతరం ఈ సందర్భంగా మోక్షానంద బుద్ధ విహార్ ప్రముఖులు బంతేజీ ధమ్మ రక్షిత ఉపాసకులను ఉద్దేశించి దమ్మ ప్రవచనాలు అందించారు. ముఖ్యంగా పౌర్ణమి విశిష్టత, బౌద్ధ సంస్కృతిలో పౌర్ణమి రోజుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్న అంశాన్ని సవిస్తరంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. తదుపరి భవతు సబ్బ మంగళం రక్కంతు సబ్బ దేవతా సదా సుఖీ భవంతుతే గౌతమ బుద్ధుడు బోధించిన పంచశీల సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ద్వేషాన్ని ద్వేషంతో కాకుండా ప్రేమతోనే జయించగలమని, సమాజంలో శాంతి, సమరసత పెంపొందించ డానికి బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని బంతే పేర్కొన్నారు. ఈ పౌర్ణమికి తిమ్మాపూర్ గ్రామ వాస్తవ్యులు చాట్ల నర్సయ్య హాజరైన ఉపాసకులకు అన్నదానం చేశారు.

## కమ్మర్‌పల్లి నూతన ఎస్సైగా సిహెచ్. సతీష్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 05:

కమ్మర్‌పల్లి మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా




సిహెచ్. సతీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఉత్తర్వుల మేరకు ఆయన ఈ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న నూతన ఎస్సై సతీష్‌కు స్టేషన్ సిబ్బంది మరియు పోలీసులు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్మర్‌పల్లి మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీసు సేవలు అందిస్తానని భరోసా ఇచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా చూస్తానని ఎస్సై సతీష్ స్పష్టం చేశారు.

## బుస్సాపూర్ శివారులో మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ: పంజాబ్ దొంగ అరెస్ట్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 05:

రహదారిపై వెళ్తున్న దంపతులను టార్గెట్ చేసి, మహిళ మెడలోంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ఆర్మూర్ రూరల్ సి.ఐ జాన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ పేట్ గ్రామానికి చెందిన ఉప్పరి గణేష్ గత శనివారం సాయంత్రం తన భార్య గంగు, కూతురు మనీషాతో కలిసి ముప్కాల్ నుండి టీవీఎస్ ఎక్సెల్ బండిపై స్వగ్రామానికి బయలుదేరారు. సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో వారు బుస్సాపూర్ శివారులోని ఎన్‌హెచ్-44 రహదారిపైకి చేరుకోగానే.. ముఖానికి మాస్క్ ధరించి సైకిల్‌పై వచ్చిన ఒక గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా వెనుక కూర్చున్న గంగు మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని క్షణాల్లో పరారయ్యాడు.

పోలీసుల వేట – నిందితుడి అరెస్ట్:

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మెండోరా ఎస్సై సుహాసిని, ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో శుక్రవారం నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. విచారణలో అతను పంజాబ్ రాష్ట్రానికి చెందిన గుర్జంత్ సింగ్ గా గుర్తింపు పొందాడని సి.ఐ తెలిపారు. నిందితుడి నుండి దొంగిలించబడిన రెండు తులాల బంగారాన్ని రికవరీ చేసి, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమర్థవంతంగా పనిచేసి నిందితుడిని పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ నరేందర్, కానిస్టేబుళ్లు భరత్ గౌడ్, లింగన్న, షౌకత్‌లను సి.ఐ జాన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



# లక్కీ భాస్కర్ రెస్టారెంట్ ప్రారంభం

## నాణ్యమైన ఆహార పదార్థాలే వ్యాపారానికి పునాది : మాజీ మంత్రులు తలసాని, పద్మారావు



**బన్సీలాల్‌పేట్/పద్మారావునగర్ జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి):**

నాణ్యమైన, రుచికరమైన, మన్నికైన ఆహార పదార్థాలను ప్రజలకు అందించినప్పుడే వ్యాపారం దీర్ఘకాలం నిలుస్తుందని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి. పద్మారావు గౌడ్ అన్నారు.

పద్మారావునగర్ ప్రధాన రహదారిలో భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన 'లక్కీ భాస్కర్ రెస్టారెంట్'ను శుక్రవారం వారు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవలి కాలంలో కల్తీ ఆహార పదార్థాల సరఫరా విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. లాభాల కోసం కల్తీ ఆహారాన్ని ప్రజలకు అందించడం అనేది ఆరోగ్యంతో చెలగాటమాడటమేనని హెచ్చరించారు. రుచికరమైన, నాణ్యమైన ఆహార పదార్థాల ద్వారానే వ్యాపారం ప్రజల్లో నమ్మకాన్ని పొందుతుందని, అదే వ్యాపార విజయానికి మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు క్రిష్ణ, అంజయ్య, దేవేందర్, హమాల్ బస్తీ రవి, బాబురావు, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో కర్ణాటక డిప్యూటీ సీఎం పరమేశ్వరను కలిసిన విహెచ్

**బెంగళూరు/హైదరాబాద్, జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి):**



కర్ణాటక ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వరను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బెంగళూరుకు వెళ్లిన విహెచ్, ఉప ముఖ్యమంత్రితో పాటు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్‌ను కూడా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలపై ఇరువురి మధ్య సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. పార్టీ నేతల మధ్య సౌహార్దత, పరస్పర గౌరవాన్ని పెంపొందించేలా ఈ భేటీ కొనసాగినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

# ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా

### రేషన్ కార్డు లేకుండానే పథకం అమలుకు కసరత్తు
### జూన్ 2న ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన తెలంగాణ సర్కార్
### ప్రీమియం భారం ప్రభుత్వానిదే- లబ్ధిదారులకు రూ.5లక్షలు
### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జూన్ 05,(ప్రజా కలం)

రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సామాజిక భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తెచ్చిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. రేషన్ కార్డు లేకుండానే సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా జీవిత బీమాను అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తుందన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఈ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని కె ఎల్ ఆర్ అన్నారు.ఏదైనా ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద చనిపోతే రూ. 5లక్షలను అందజేస్తారు.ఆర్థిక భరోసా కల్పించే ఇందిరమ్మ జీవిత బీమాకు ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని కె ఎల్ ఆర్ తెలిపారు. లబ్ధిదారుడి మీద భారం లేకుండా ఈ పథకం అమలు చేస్తారు.రాష్ట్రంలో దాదాపు 1.5 కోట్ల కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు పక్కా ప్లాన్ చేశారని లక్ష్మారెడ్డి కొనియాడారు.ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా 99లో రోజుల కార్యచరణ విజయవంతంగా కొనసాగుతుందన్నారు.జూన్ 12 వరకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తుందని లక్ష్మారెడ్డి కిచ్చెన్నగారు తెలిపారు.






# రాష్ట్రపతి నిలయంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

## మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌లు, మొక్కల పెంపకం కార్యక్రమాలు

**సికింద్రాబాద్, జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి):**

"వాతావరణం కోసం ఇప్పుడే" అనే ఇతివృత్తంతో రాష్ట్రపతి నిలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. జూన్ 3 నుండి 5 వరకు సాగిన ఈ కార్యక్రమంలో సుమారు 1,500 మంది విద్యార్థులు, పౌరులు, పర్యావరణ నిపుణులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

జూన్ 3, 4 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (TSPCB), EPTRI, ఎక్క కదం ఫౌండేషన్ సంయుక్తంగా మట్టి వస్తువుల తయారీ, పర్యావరణ అనుకూల హరిత క్రీడలు, వంటగది వ్యర్థాల కంపోస్టింగ్, నిమ్మజాతి తొక్కలతో బయో ఫ్లోర్ క్లీనర్ల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. గాలి, శబ్ద నాణ్యత పర్యవేక్షణ, పంచగవ్య ఉత్పత్తులు, ఔషధ మొక్కల వినియోగంపై ఇంటరాక్టివ్ సెషన్లు కూడా జరిగాయి.

ముగింపు రోజు (జూన్ 5) రాష్ట్రపతి నిలయం సీపిడబ్ల్యుడి (హార్టికల్చర్) విభాగం ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 136 మొక్కలు నాటారు. జామ, నిమ్మ, గోల్డెన్ షవర్ ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటడంతో కార్యక్రమం ప్రారంభమైంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ శ్రీ అరవింద్ కుమార్ ద్వివేది, డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ శ్రీ సి. దినేష్ కుమార్ రెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కె. లీలా లక్ష్మా రెడ్డి, ఇండియా టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రవిపాటి పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ పర్యావరణ అవగాహనను ఆచరణలోకి తీసుకురావాలని, సుస్థిర జీవనశైలిని అలవర్చుకోవాలని, భవిష్యత్ తరాలకు పచ్చని భూమిని అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా నాటకం, గానం, ఫ్యాన్సీ డ్రెస్, కవితా పఠనం, క్లైమేట్/గ్రీన్ స్నాప్ ఛాలెంజ్ వంటి పోటీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో నిర్వహించారు. విజేతలకు ముగింపు వేడుకలో బహుమతులు ప్రదానం చేశారు.

## హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన

# "థ్రెడ్ పోచంపల్లి"

### తెలంగాణ ప్రసిద్ధ ఇకత్ వారసత్వానికి అద్భుత వేదిక
### థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనను ఘనంగా ప్రారంభించిన
### వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
### రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




రంగారెడ్డి జిల్లా, జూన్ 05,(ప్రజా కలం)

తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనను హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హాల్–4లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు, చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమై సందర్శకులను ఆకట్టుకుంది. ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతల చేత రూపొందించిన అద్భుత హస్తకళాఖండాలు, సహజ రంగులు వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ఆ అనుభూతిని పొందే అవకాశం కల్పించారు. ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరిస్తూ ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. 100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహ అలంకరణ ఉత్పత్తులు, జీవనశైలి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. తెలంగాణ టూరిజం శాఖ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై, పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది. వీటి ద్వారా సందర్శకులు నేరుగా నేత కుటుంబాలను కలుసుకుని, సంప్రదాయ మగ్గాల పనితీరును వీక్షించే అవకాశం పొందనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి, అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు.

పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లు సందర్శకులకు సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7, 2026 వరకు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి ప్రోత్సహించడానికి ఇది అరుదైన అవకాశంగా నిలవనుంది.




## త్రాగునీటి సమస్యపై ప్రభుత్వంపై

# మాజీ మంత్రి తలసాని ఆగ్రహం

### బిల్వర్డ్ అపార్ట్‌మెంట్ వద్ద 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకర్ ప్రారంభం



**పద్మారావునగర్ జూన్ 5 (ప్రజా కలం ప్రతినిధి):**

ప్రజల కనీస అవసరమైన త్రాగునీటి సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పద్మారావునగర్‌లోని బిల్వర్డ్ అపార్ట్‌మెంట్ వద్ద 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లాలకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడం, కొన్ని ప్రాంతాల్లో అసలే నీరు రాకపోవడంతో ప్రజలు ట్యాంకర్లను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పద్మారావునగర్ ప్రాంతంలోనే రోజుకు సుమారు 200 ట్యాంకర్లు నీటి కోసం బుక్ అవుతున్నాయని పేర్కొంటూ సమస్య తీవ్రతను గుర్తుచేశారు.

ట్యాంకర్ బుక్ చేసినా వారం రోజుల తర్వాత నీరు అందుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో త్రాగునీటి సమస్యలు లేవని గుర్తు చేసిన ఆయన, పద్మారావునగర్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో జనాభా కూడా అధికంగా ఉందన్నారు. ప్రస్తుతం వాటర్ వర్క్స్ విభాగం ద్వారా 5 వేల లీటర్ల ట్యాంకర్ ద్వారా సరఫరా జరుగుతున్నప్పటికీ, అవసరాలకు సరిపోకపోవడంతో వాటర్ వర్క్స్ ఎండీతో మాట్లాడి 10 వేల లీటర్ల ట్యాంకర్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ చర్యతో త్రాగునీటి సమస్య కొంత మేరకు పరిష్కారమవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే తలసానికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సీజీఎం వినోద్, బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బిల్వర్డ్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు జగ్గయ్య ముకుంద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్కులో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 05.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని అర్బన్ ఆక్సిజన్ పార్కులో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "చెట్టు విలువ తెలుసా" అనే పోస్టర్‌ను ఆవిష్కరించి, మొక్కలు నాటి సంరక్షించాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా జీవన విధానంలో భాగం కావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా తీసుకెళ్లాలని, జాతీయ రహదారుల వెంట భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం కనీసం 33 శాతం పచ్చదనం అవసరమని పేర్కొన్నారు. గత ఏడాది జిల్లాలో 22 లక్షల మొక్కలను నాటగా, ఈ ఏడాది 17 లక్షల మొక్కలను నాటేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమావతి, సీపీ సాధన రష్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఎఫ్ఓ సంధ్యారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013 Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001. Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com